ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 07, 2015



సుస్వర లక్ష్మి

రంగుల కళ కలం

బుల్లి స్టార్లు

మైఖేల్ పాల్ స్మిత్ సినీ తారలకు సంబంధించిన ప్రతిదీ ఆసక్తికరమే. వారి ప్రేమలు, పెళ్లిళ్లు, పిల్లలు, విడాకులు... అన్నీ వార్తల్లోని అంశాలే. అయితే స్టార్లలోనూ రెండు రకాల వారుంటారు. కొందరేమో తమ వ్యక్తిగత జీవిత విశేషాలను బయటపెట్టడానికి ఏమాత్రం ఇష్టపడరు. ఆఖరుకు తమ చిన్నారుల ఫొటోలు సైతం పత్రికల్లో రావడం వారికి పెద్దగా రుచించదు. అందుకే విమానాశ్రయాల దగ్గర కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటుంటారు. మరి కొందరు తారలు మాత్రం అభిమానులకు తమ బుజ్జాయిలను పరిచయం చేయడానికి చాలా ప్రాధాన్యతనిస్తారు. అందుకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రమ్, ట్విటర్ ...ను సాధనాలుగా ఉపయోగించుకుంటారు. అలా అలరించిన కొన్ని ఫొటోలు ...

లక్ష్మి మంచు

నటి, నిర్మాత లక్ష్మి మంచు గత సంవత్సరం సరొగసీ ద్వారా చందమామ లాంటి బిడ్డకు తల్లయింది. అప్పటి నుంచి తన చిన్నారి విద్యా నిర్వాణ ఫొటోలను ఎప్పటికప్పుడు మీడియా ముందుంచుతోంది. అలాంటి వేలాది ఫొటోలలో ఇదీ ఒకటి.

ఎన్టీఆర్ జూనియర్

ఈ మధ్యే ఎన్టీఆర్ జూనియర్... పది నెలల కుమారుడు అభయ్ రామ్ ఫొటోలు షేర్ చేసి అభిమానులకు ఆశ్చర్యానందాలను పంచాడు. తన పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు, శుభాకాంక్షలు అందించిన ఫ్యాన్లకు ధన్యవాదాలు తెల్పుతూ ఈ ఫొటోను పోస్ట్ చేశాడు. "ప్రేమాభిమానాలను పంచిన నా అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు. అందుకు ప్రతిగా ఈ ప్రత్యేక క్షణాలను వారితో పంచుకోవాలనుకుంటున్నాను".

రితేష్ దేశ్‌ముఖ్

బాలీవుడ్ తారలూ తక్కువేం కాదు. ఈ మధ్యే అమ్మానాన్నలైన చూడముచ్చటైన జంట జెనీలియా-రితేష్ దేశ్‌ముఖ్ తమ ముద్దుల చిన్నారి రియాన్ ఫొటోను ట్వీట్ చేశారు. తన తండ్రి డెబ్బయ్యవ పుట్టిన రోజు సందర్భంగా రితేష్ ఈ ఫొటోను ట్వీట్ చేయడం విశేషం.

నారా లోకేష్

విశ్వవిఖ్యాత నటుడిగా అభిమానులు పిల్చుకునే ఎన్టీఆర్ జయంతి రోజున ... టిడిపి అధినేత కుమారుడు లోకేష్ తన ముద్దులొలికే కుమారుడికి నామకరణం చేశాడు. "మా తాతయ్య పుట్టినరోజు సందర్భంగా...మా అబ్బాయికి దేవాంశ్ అని పేరు పెట్టుకున్నాం" అని చెప్పారు సంతోషంగా.

అల్లు అర్జున్

కుమారుడు అల్లు అయాన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ కొన్ని అద్భుతమైన ఫొటోలను ఫేస్ బుక్‌లో వుంచాడు. చిన్నారిని ముద్దాడుతున్న, ప్రేమగా హత్తుకున్న ఫొటోలు నెటిజనులను అమితంగా ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

'అద్దె' తిప్పలు

కొత్త చెప్పలు అరిగేలా తిరిగినా అందదు. అందంగా ఎడారిలో ఒయాసిస్సులా ఊరిస్తుంటుంది. అదే అద్దె ఇల్లు. పల్లెటూళ్లలో తెల్సిన వారిని పట్టుకుంటే పనైపోతుందన్న భరోసా వుంటుంది. మరి ఊళ్లో ప్రతి ఒక్కరి పుట్టు పూర్వోత్తరాల గురించిన సమాచారం గూగుల్ మాదిరి వారి గుప్పెట్లోనే వుంటుంది. దాంతో 'ఎవరు' 'ఎవరి' తాలూకానో చెప్పేసి ఇల్లు వెతికి పెడతారు. ఒకవేళ వీలు కాకపోతే మొహమాటం లేకుండా మొహానే చెప్పేస్తారు.

¤ ¤ ¤

సిటీల్లో సీనే వేరు. పర్సంటేజీ పడేస్తే కిరాయికి ఇళ్లు చూపిస్తారు. అయినా... అద్దెలు అద్దిరిపోతాయి. షరతులు బెదరగొడతాయి. రాత్రి పది దాటాక తలుపులకు బీగాలు పడిపోతాయి. మంచినీళ్లు వచ్చేది వారానికి రెండు సార్లే. కొన్ని ఇళ్లల్లో మాంసాహారం నిషేధం. మద్యం సంగతి సరేసరి. ఇంకొందరు బ్రహ్మచారులకు ఇళ్లు ఇవ్వరు. మరి కొందరైతే అచ్చంగా బ్రహ్మచారులకే ఇస్తామంటారు. ఉద్యోగం వుంటేనే అద్దెకు ఇల్లు దొరుకుంది. వ్యాపారస్తులకు మాత్రమే ఇస్తామంటారు కొందరు.

¤ ¤ ¤

ఇవన్నీ కంటికి కనిపించే ఇబ్బందులు సబ్బందులు. కనిపించని గోడలు, కుడ్యాలు అనేకం. కులం, మతం, రంగు, రూపం, ప్రాంతం, రాష్ట్రం... అన్నీ ఆటంకాలే. 'చుక్కేసుకుంటారా? ముక్క తింటారా?' అంటూ మొదలౌతుంది ఇంటర్వ్యూ. ఔనన్న సమాధానం వచ్చిందో! గేటు పడిపోతుంది మొహానే! ఒకవేళ పడకపోయినా... ఏ కులపోళ్లో తెల్సుకోవడానికి అనేకానేక ఉప ప్రశ్నలు శరాల్లా వచ్చి తాకుతాయి. బురఖా వున్నా...మొహాన బొట్టు లేకపోయినా... మరో రకపు ప్రశ్నలు ఎదురౌతాయి. మసీదుకెళ్తారా? చర్చికెళ్తారా? పేరేంటి? ఇంటి పేరేంటి? వంటివి. ప్రతిగా వచ్చిన జవాబును బట్టి 'ఓ.. హిందూ పేరులా లేదే. మీరు లేనిపోని గొడవలు తీసుకొస్తారు. ఇది సంసారులు వుండే కొంపండీ బాబూ' అనేస్తారు. 'అబ్బో మీరు ఆదివారం ప్రార్థనలు చేస్తారా? మీరు పొట్టి బట్టలేసుకుంటారండీ. నాన్ వెజ్ తింటారు. మా పిల్లలకు అలాంటివి ఇష్టముండదు. మరో ఇల్లు చూస్కోండి' అంటారు.

¤ ¤ ¤

వయసు మూడు పదులు నిండి సింగిల్‌గా వున్నా... ఇల్లు ఇవ్వరు. 'అబ్బో... మీకు మేం ఎక్కడ కావలి కాస్తామండీ. స్నేహితులు... మందు బుడ్లూ... మా వల్ల కాదు' అంటూ నొసలు చిట్లించేస్తారు. 'టీవీ చానళ్లలో పనా! అయితే అద్దెకు ఇవ్వలేమండీ. మొహాన రంగు పులుముకునే వారిని నమ్మడం కష్టం' అంటూ కొత్త సూత్రీకరణలు చేసేస్తారు. 'నైజీరియన్లా... అబ్బో... డ్రగ్సు గోల పడలేమండీ. కేసులూ, పోలీసులూ...మావల్ల కాదనేస్తారు.

¤ ¤ ¤

ఇన్ని ఇబ్బందులు అధిగమించి... తిప్పలు పడి... నగరాల్లో అద్దెకో ఇల్లు సంపాదించేసరికి... చుక్కలు కనిపిస్తాయంటే ఒట్టు. ప్రతి ఒక్కరికీ ... ఏదో ఒక దశలో ... ఎదురయ్యే చేదు అనుభవమే.

■

◆ మనలో మాట

ఈ సంచికలో....

రంగుల కళకలం

కవర్‌స్టోరీ 14

మారుమూలన దాక్కుని చప్పుడు చేయని వీధి, రాత్రికి రాత్రే రంగులద్దుకుని కళ-కలం సృష్టిస్తే. బీటలు వారి, వెల్ల వెలిసి మోడైన గోడ, సూరీడు రంగు తొడిగే లోపు కళనద్దుకుని చిత్తరువై వెల్లివిరిస్తే. పిట్ట గోడలు వాస్తవ కథను అల్లితే. వీధి జీవన నాటకాన్ని రచిస్తే. గ్రాఫిటీ గుర్తొచ్చి మనస్సుల్లోకి తొలుచుకుపోతుంది. అది సమాజంపై ముద్ర వేస్తూ విస్ఫోటన మౌతుంది. 'విప్లవం వర్థిల్లాలి' నినాదానికి గొంతుకైనా, 'యుద్ధం వద్దు' నిరసనకు ప్రదర్శన అయినా, అందంగా విప్పార్చే పూరేకైనా, సందేశంగా విడమర్చే సులేఖైనా ఆ కళతో కొత్తదనాన్ని హత్తుకోవాల్సిందే. గ్రాఫిటీ మన యువ సంస్కృతికి నేటి సరికొత్త వర్ణచిత్రం. విశ్వ మానవుని భావ ప్రకటనకు ధ్రువపత్రం.



చుద్దామా 3
కొండ గుహల్లో... పురుగుల వెలుతురులో...

వింతలోకం 5
ఈ- దుస్తులు

స్ఫూర్తి 6
పరుగు పంతం

సినిమా కబుర్లు 7
సుస్వర లక్ష్మి

నువ్వల్-పువ్వుల్ 9

ప్రత్యేకం 10
రిక్షా యాత్ర

రుచి 11
నీరుల్లి కోడి

కథ 18
మాయ

బాలనేస్తాలు 22
బన్నీల రాజ్యం

కొత్త పుస్తకాలు 24
చదివించే 'సత్య'

అంతమంది భార్యలు నీళ్ళు మోయడానికే... 12

గజరాజ వైభోగం-13



టపా

ఆదిమానవుల వారసులు

అండమాన్ దీవుల్లో దాదాపు అంతరించిపోతున్న కొన్ని తెగల బ్రతుకు పోరాటాలను కళ్లకు కట్టినట్లు చూపించిన రచయితకు కృతజ్ఞతలు. జారువా, సెంటినల్స్ తెగల మనుగడ కోసం చీకటి అడవుల్లో తలదాచుకుంటూ బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రాణాన్ని కాపాడుకోవడం జాలిగొలిపింది. మైనస్ 60 డిగ్రీల భయంకరమైన చలి వాతావరణంలో హాయిగా సంచరిస్తున్న సైబేరియన్‌ల జీవన విధానం, కొన్ని ప్రాంతాల్లో అడుగేస్తే మంచు ప్రతిమలాగ గడ్డకట్టుకుపోవడం గగుర్పాటు కలిగించింది. బ్రెజిల్‌లో బెస్తవారికి చేపల వేటలో సహకరిస్తున్న డాల్ఫిన్ మిత్రుల విషయం ఆహ్లాదపరిచింది.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం.

రుతుగానాలు

అట్టమీది కథ 'రుతురాగాలు' ముఖచిత్రంపై ఉన్న ఫొటోలో... ఒక పశువుల కాపరి వేడిని తట్టుకోలేక అరటి ఆకును కప్పుకున్న విషయాన్ని గ్రహించి ఫోటో తీసిన ఫోటోగ్రాఫర్‌కి వందనాలు. భూమి ఏర్పడిన నుంచి సూర్యుని తాపం ఉంది. కానీ, విజ్ఞానవంతుడైన మనిషి వివేకాన్ని పక్కన పెట్టి అభివృద్ధి పేరిట పచ్చదనాన్ని నాశనం చేసి భూతాపాన్ని పెంచుతున్నాడు. అభివృద్ధి అవసరమే. ప్రకృతిని, భూతల్లిని, జీవరాసులను కాపాడటం కూడా మానవ ధర్మం. పచ్చదనం, చెరువులు, నదులను కాపాడటం మన కర్తవ్యం. 'తాళం తిప్పలు'... భద్రతకు మారు పేరు తాళం. వాగుడు కట్టించాలంటే తాళం వేయాలి. డాల్ఫిన్ మనిషికి సరిజోడి. ఒకే కప్పుకింద ఊరంతా నిజమైన వింత. ఆస్ట్రేలియా అందమైన లొకేషన్లపై స్టోరీ బాగుంది. 'చవులూరించే చేపల కూర'లో మూడు రకాల చేపల తయారీ విధానం బాగుంది. ఎన్.టి.ఆర్ గురించి చెప్పకోవాలంటే వెండితెరకు మరిన్ని వెలుగులు తెచ్చిన వాడు. ఎండ్ల బండి కథ బాగుంది. రైతుకు ఎడ్లబండికి విడదీయరాని బంధం ఉంది.

కనకలక్ష్మి, పూజారి పేట, ఆముదాల వలస.

వింతైన లోకం

ఈ వారం వింత లోకం బాగుంది. ప్రేమ పిపాసి అయిన అహ్ జీ తన ప్రియురాలి కోసం ఇరవై ఏళ్లగా ఎదురుచూస్తూ ఒకేచోట ఉండడం చాలా బాధకరమైన విషయం. ప్రస్తుత సమాజంలో ఉండే భార్యభర్తల మధ్య ఓ చిన్న గొడవ వచ్చినా విడాకులు తీసుకుంటున్నారు. ఇలాంటి లోకంలో తన ప్రేయసి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడటం ఆశ్చర్యకరం. అట్టమీద కథలోని రుతురాగాలు చాలా బాగుంది. ఎల్‌నినో గురించి చాలా పెద్దగా ఇచ్చారు. ప్రజలు ఎల్‌నినో గురించి చదవడం ద్వారా ఈ సంవత్సరం కూడా అనావృష్టి వస్తుందేమోనని భయపడే అవకాశాలు ఉన్నాయి.

రాము, కడప

రైతన్నాగ్రహం

ఎడ్లబండి గురించి ఇచ్చిన వ్యాసం చాలా బాగుంది. దేశానికి వెన్నుముకైన రైతన్నకు వెన్నముక లేకుండా చేస్తున్నారు ఈ పాలకులు, ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు రైతన్న ఎందుకు పనికిరానివాడుగా మిగిలి పోయాడనేది ఆలోచించాల్సిన విషయం. రైతన్న ఆగ్రహిస్తే ఎలా ఉంటుందో ఎడ్లబండిలో చూపించారు. ఎంతో మందికి అన్నం పెట్టిన రైతన్న పరిస్థితి బాగోలేక ఒకరి దగ్గర కూలీ పనిచేసుకుంటు బతకాల్సిన దుర్భర పరిస్థితి వచ్చింది.

టి.జగదీష్, హైదరాబాద్

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈసారి భిన్నమైన ప్రదేశాలను సందర్శించే ... విభిన్నమైన విశేషాలను పరిశీలించే అవకాశం కలిగింది. క్వీన్స్‌లాండ్‌లోని హిందూ దేవాలయం భారతీయులెవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇక టొంబొరిన్ కొండ గుహల్లో వెలుతురు పురుగులు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. ఆస్ట్రేలియా పురాతన చరిత్రను తెలిపే మ్యూజియంను తప్పక సందర్శి ంచాల్సిందే. ఇక మోడరన్ ఆర్ట్ గ్యాలరీ, డైనోసార్ మ్యూజియం... సంగతులు సరేసరి.

కొండ గుహల్లో.. పురుగుల వెలుతురులో...

క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రంలోని హిందూ దేవాలయం చాలా పెద్దది. ఇది వినాయకుడి గుడి. విశాల స్థలంలో నిర్మితమైంది. లోపల చాలా కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు. వినాయకుడి గర్భగుడి చుట్టూ అనేక మందిరాలున్నాయి. వాటిలో ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణుడు, నరసింహ స్వామి, అయ్యప్ప, లక్ష్మి, సరస్వతి, పార్వతి కుమార స్వామి, శివుడు, రాఘవేంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. భారత దేశం నుండి ఆస్ట్రేలియా వచ్చిన వారిలో రకరకాల దేవుళ్ళను ఆరాధించేవారున్నారని కాబోలు ఇలా అనేక దేవుళ్ళను ప్రతిష్ఠించారు. ఇక్కడి అర్చకులు తమిళనాడు నుండి వచ్చిన వారే. గాలి గోపురం మీద వివిధ విగ్రహాల్ని నిర్మించారు. చక్కని నైపుణ్యంతో నిర్మించిన వీటికి చేయి తిరిగిన చిత్రకారుల చేత రంగులు వేయించారు.

బ్రిస్బేన్ దగ్గర్లో వున్న టొంబొరిన్ కొండగుహల్లో వెలిగే పురుగుల్ని చూడటం పర్యటనలో ముఖ్య భాగం. వెలిగే పురుగులు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ అడవుల్లో మాత్రమే దొరుకుతాయి. ఈ గుహలను 2004లో నిర్మించారు. 2005 నుండి పర్యాటకుల్ని అనుమతిస్తున్నారు. ప్రవేశ రుసుం మాత్రం చాలా ఎక్కువ.

వెలుగులోంచి లోపలికెళ్ళగానే ఒక చీకటి గదిలో ఏడు నిమిషాలు కూర్చోబెట్టి గైడు వివరంగా అన్నీ విశదీకరిస్తాడు. ఆపైన వెలిగే పురుగుల గుహలోకి తీసుకెళ్తాడు. కటిక చీకటి. పురుగులు గోడలకు, సీలింగుకు అంటుకుని నక్షత్రాలుగా వెలుగుతుంటాయి. ఇవి వేల సంఖ్యలో ఉంటాయి.

అమావాస్య చీకట్లో నక్షత్రాల వెలుగులా ఉంటుంది. వాటిని తాకినా, వెలుగు అగుపించినా అవి వెలగవు. గైడు ఎర్ర టార్చిలైటుతో వివరిస్తుంటాడు. వీటి ఆహారం కీటకాలు. అడవుల్లో కీటకాల్ని వలల్లో పట్టి తెచ్చి వదులుతుంటారు. సకాలంలో ఆహారం అందకపోతే పెద్ద పురుగులు చిన్న పురుగుల్ని తినేస్తాయి. ఈ పురుగులు లార్వా దశకు వచ్చేసరికి దాదాపు ఒక సంవత్సరం పడుతుంది. ఈ దశలోనే సంవత్సరంపాటు వెలుగుతాయి. ప్యూపా దశలో కొద్ది రోజులే బతికి మరణిస్తాయి. ఆడ పురుగులు ఎక్కువ కాంతిని, మగ పురుగులు తక్కువ కాంతిని ప్రసరిస్తాయి. ఇవి ఆకలితో ఉన్నప్పుడు మరింత ఎక్కువగా కాంతిని వెదజల్లుతాయి.

వెలుగుకు ఆకర్షింపబడి కీటకాలు ప్రవేశిస్తే వాటిని ఇవి తినేస్తాయి. గుహల్లో ఉన్న ప్రాణవాయువు, ఇతర వాతావరణం కలిసి రసాయనిక ప్రక్రియ జరిగి వెలుగులు పచ్చగా కనపడతాయి. మనం చూడనివి చూస్తే తెలియనివి, తెలిస్తే ఆహ్లాదానికి హద్దులుండవు. ఈ దృశ్యాలు పర్యాటకుల మనసుల్లో చెరిగి పోని ముద్రవేస్తాయి.

మ్యూజియం

ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండు రాష్ట్రంలో వున్న మ్యూజియం చూడదగినది. ఆస్ట్రేలియా పురాతన చరిత్ర గమనిస్తే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కువగా కొండల్లో, గుహల్లో, అరణ్యాల్లో జీవించేవాడు. వీరిని అబారిజినల్స్ అంటారు. ప్రదర్శనకు వుంచిన వివిధ వస్తువులు, వాహనాల పరిణామ దశలు మనోవికాసానికి తోడ్పడతాయి.

సోలార్ సైకిల్

1970లో క్వీన్స్‌ల్యాండు యూనివర్శిటీవారు సోలార్ సైకిల్ కనిపెట్టారు. దీని పేరు సోలార్ టెండమ్. దీనిపై నలుగురు ప్రయాణించవచ్చు. సూర్యరశ్మి నుంచి వచ్చిన ఎలక్ట్రికల్ ఎనర్జీ నేరుగా

వెనుక చక్రానికి బిగించి ఉన్న మోటారుకు వస్తుంది. పెడలు తిప్పగానే మరింత వేగం పుంజుకోవటానికి తోడ్పడుతుంది.

డైనోసార్ మ్యూజియం

'డైనోసార్స్' మ్యూజియంలో ఉన్న మరో ఆకర్షణ ఇచ్చట ఉంచిన కొన్ని లక్షల సంవత్సరాల కిందట భూమిపై తిరుగాడిన డైనోసార్ మహాకాయ అస్థిపంజరం ఎముకలు మనకు అగుపిస్తాయి. ఎంత దగ్గర నుండి చూసినా కనుక్కోలేము. కాని ఊహా జనిత చిత్రాన్ని నిర్మించి రాబోయే తరాల కోసం ఇక్కడ ప్రదర్శనకు పెట్టారు.

బ్లాక్ బెస్ సైకిల్

మరో ముఖ్యమైన ఆకర్షణ "బ్లాక్ బెస్" సైకిల్. ఇలాంటి సైకిళ్ళు కూడా ఉండేవా అని ఆశ్చర్యమేస్తుంది. హెరీక్లాక్ 1884లో ఈ సైకిల్ కనిపెట్టారు. చిన్నప్పటినుండి క్లాక్‌కు సైకిల్ ప్రయాణమంటే ఎంతో ప్రీతి. స్కూలు దశలో ఉన్నప్పుడు వారంలో దాదాపు 300 మైళ్ళు ప్రయాణించేవాడు. దీని నిర్మాణమంతా ముందు ఒక పెద్ద చక్రం వెనుక ఒక చిన్న చక్రం. చిన్న చక్రానికి పై భాగాన కూర్చొనే సీటు. పెద్ద చక్రానికి పెడలు. ఇదీ దీని ఆకృతి.

కళ కనికట్టు

మనసును కట్టిపడేసే మరో దృశ్యం. సముద్రపు ఒడ్డున ఇద్దరు పరిశోధకులు తాబేలును పట్టుకుని పరీక్షిస్తూ వుంటారు. తటాలున చూసిన వారికి మ్యూజియం సిబ్బందేమోనని అనిపిస్తుంది. కానీ అది ఓ బొమ్మ. బొమ్మలకు ప్రాణం పొయ్యడమంటే ఇదేనేమో. చూడదగింది మోడరన్ ఆర్ట్ గ్యాలరీ. ఇక్కడ మోడరన్ ఆర్ట్ చిత్రాలను ప్రదర్శనకు వుంచారు. జపాన్ మోడరన్ ఆర్ట్‌లో ముందంజ వేసింది. ఎక్కువగా జపాన్ కళాకారుల చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకర్షిస్తాయి. ఆలోచింపజేస్తాయి, ఆనందింపజేస్తాయి. ఒకానొక కళాఖండంలో రెండు దుప్పులను ఒకే దుప్పిగా గాజు, మార్బుల్‌తో శిల్పించటం ఇందులో ప్రత్యేకత.

ఆస్ట్రేలియాలో అక్కడక్కడ రోడ్లకు దరిదాపుల్లోను లోపలి అరణ్యాలలోను కొలనులు ఏర్పడి వుంటాయి. ఇవి ఎడారిలో ఒయాసిస్సుల్లా ఉంటాయి. నీళ్ళు వడగట్టినట్లుగా ... పక్షులు, జంతువులు తాగడానికి ఉపయోగపడతాయి. సేద్యానికి ఉపకరిస్తాయి. ఇవి ఎండిపోవు.

- అడిగోపుల వెంకటరత్నమ్

ఫోటోలు: శ్రీకాంత్

'ఈ' టీ కొట్టు

మంచి టీ తాగితేనే కానీ, ఫైల్ కదిలేట్టుగా లేదు. కానీ, అనుకున్నదే తడవుగా టీ తెచ్చిపెట్టేది ఎవరు? ఇంకో పని చెబితే బాయ్ తిట్టుకునేట్టు ఉన్నాడు. టీ లేకుండానే పనికానిచ్చేద్దాం.. అనుకునే ముంబైకర్లకు మాంచి టీ కొట్టిన ఫీలింగ్‌నిచ్చే వార్త అందింది. ఆన్‌లైన్‌లో టీ కొట్టును తెరిచి ఆర్డర్లు తీసుకుంటోంది చోటూచాయ్‌వాలా.కామ్

ముంబైలోని బాంద్రా నిండా ఎటు చూసినా ఆఫీసులే కనిపిస్తాయి. ఇక ఇంటర్నెట్‌లేని ఫోనంటూ, ఆఫీసంటూ అక్కడ కనిపించదు. టీ అంటే పడిచచ్చే ముంబైకర్ల పని ఒత్తిడి తగ్గించే ఈ అమృత పానకానికి డిమాండ్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోండి. చైన్‌స్మోకర్లు ఉన్నట్టే చైన్ చాయ్ డ్రింకర్లున్నారు అక్కడ. వారి అవసరాల కోసమే జెపో అనే ఆన్‌లైన్ స్టార్టప్ కంపెనీ చోటూచాయ్‌వాలా వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ వెబ్‌సైట్‌కు మంచి స్పందనే వచ్చింది. ఆన్‌లైన్లో ఆర్డరిస్తే నిమిషాల్లో టీ చేతికందేలా దీన్ని రూపొందించారు. ఇది ఎలాగంటారా? బాంద్రాలోని స్థానిక చాయ్‌వాలాలను చేర్చుకుని వారికి దగ్గరలోని ఆఫీసుల టీ అవసరాలను తీరుస్తున్నారు. ఆర్డర్ రాగానే సమీప టీ కొట్టుదారుకి ఎస్ఎంఎస్ వెళ్లిపోతుంది. అందులో ఆఫీస్ చిరునామా, ఆర్డర్ వివరాలు ఉంటాయి. ఎస్ఎంఎస్ అందుకున్న చాయ్‌వాలా టీని సరఫరా చేస్తాడు. ప్రస్తుతం 5 టీ కొట్లతో నడుస్తున్న ఈ వెబ్‌సైట్ మంచి ఆదరణ పొందుతోంది. నేషనల్ కళాశాల, హిల్ రోడ్డు, లింకింగ్ రోడ్డు, బాంద్రా పోస్టాఫీసు, వాటర్‌ఫీల్డ్ రోడ్డు వద్దనున్న చాయ్‌వాలాలు సేవల్ని అందిస్తున్నారు. రెండు కిలోమీటర్ల పరిధిలోని ఆఫీసులు, ఇళ్లకు వీరు టీ సప్లై చేస్తున్నారు. చందాదారులుగా చేరేందుకు వారానికి 70, నెలకు 280 రూపాయల చొప్పున ప్యాకేజీలను అందిస్తున్నారు. టీ చేతికందిన తర్వాత కూడా డబ్బు చెల్లించొచ్చు. ఈ పద్ధతి బాగా నచ్చడంతో చాలా మంది ఆర్డర్లను ఇచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు. క్రమంగా ముంబై అంతటా వీరి సేవల్ని విస్తరించే పనిలో పడ్డారు. ఇది విజయవంతమైతే ఇతర నగరాలకు ఈ తరహా వెబ్‌సైట్లను విస్తరించాలని చూస్తున్నారు. చోటూచాయ్‌వాలాలోనే మరిన్ని ఆహార వస్తువుల్ని కూడా జత చేయాలనుకుంటున్నారు. అన్ని చోట్లా టీకే డిమాండ్ ఉండదని ఆయా ప్రాంతాల్లో బాగా ఆదరణ ఉన్న బేవరేజెస్‌ను అందించాలని కోరుతున్నారు. అయితే ఈ వెబ్‌సైట్లన్ని అసంఘటితంగా ఉన్న చిన్న వ్యాపారాలకే పరిమితం చేసి వారి ఆదాయం పెరిగేందుకు ప్రయత్నించాలని చూస్తున్నారు.



ఈ - దుస్తులు

ఇప్పుడు ప్రతి పనికి కంప్యూటర్‌తో పనే. దానికి బానిసలైనట్టు చిహ్నంగా స్క్రీన్ ఎదుట మరీ ముందుకు వంగి పనిలో నిమగ్నమవుతున్నారంతా. పని పూర్తయ్యాక కాస్త వెనక్కు వాలితే మెడపట్టేయడమో, నడుము స్టక్ అవడమో, వెన్ను నెప్పి పుట్టడమో ఖాయం. కొన్ని రోజులకు రోజూ మర్దన చేసుకునే వరకు పరిస్థితి వెళ్లిపోతోంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా అదుపు తప్పి ఆటో మేటిగ్గా ముందుకు వంగి పోవడం జరిగిపోతోంది. దీనికి పరిష్కారంగా డచ్ ఫ్యాషన్ డిజైనర్ జెఫ్రీ హైలిగెర్స్ సరికొత్త క్లోతింగ్ లైన్‌ను ప్రవేశపెట్టాడు. సరైన శరీర భంగిమలో ఉంచడంలో ఈ దుస్తులు ఉపయోగ పడతాయి. పోస్చర్ అని పేరు పెట్టిన ఈ డిజైన్ భవిష్యత్ దుస్తులకు బ్లూ ప్రింట్‌గా ఉపయోగపడతాయని ఆయన ఆశిస్తున్నాడు. కాస్త ముందుకు వంగగానే వెన్ను భాగంలో బిగుసుకుపోయి వెనక్కు జరిగేలా ఇవి చేస్తాయి. ఈ దుస్తుల రూపొందించడంలో జెఫ్రీ ఓ ఫిజియో థెరపిస్ట్ సహాయాన్ని కూడా తీసుకున్నాడు. ఆఫీస్‌కు నప్పేలా వీటిని తెలుపు, నీలం, బూడిద వర్ణాల్లో తయారుచేసి మార్కెట్‌లోకి వదిలాడు. వేలకు వేలు ఫిజియోథెరపిస్టులకు పోసే కన్నా చక్కగా వీటిని వాడితే బెటరని చాలామంది కొనేందుకు మొగ్గు చూపుతున్నారట.

భయం లేని రోజులు

వెనిజులాకు చెందిన మిషెల్లీ పోలర్‌కు చాలా భయాలున్నాయి. ముఖ్యంగా న్యూయార్క్ జీవితం అంటేనే చాలా దడపుడుతోందట. ఈ మధ్యే విజువల్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీ కోసం అక్కడకు వెళ్లిన ఆమెకు ఆ నగర జీవనం తిప్పలు పెడుతోంది. దీనికి పరిష్కారంగా ఆమె ఓ కొత్త ఆలోచన చేసింది. తనకున్న భయాలను ఎదుర్కొనేందుకు వరసగా వంద రోజులు వాటితో గడిపితే భయం వదిలిపోతుందని అనుకుంది. తనకున్న భయాలన్నింటినీ ఓ లిస్ట్‌గా రాసి రోజుకొక భయాన్ని రుచి చూస్తోంది. ఇప్పటికే యాభై వరకు భయాల్ని ధైర్యంగా ఎదుర్కొని అవి ముందు అనుకున్నంత ప్రమాదకరమేం కాదని ఊపిరిపీల్చుకుంది. ఈ భయాల్లో మన స్పైసీ భారతీయ వంటకాల్ని రుచి చూడటం కూడా ఒకటట. న్యూయార్క్ వీధుల్లో రాత్రుళ్లు ఒంటరిగా కారు డ్రైవ్ చేసుకుంటూ గమ్యానికి చేరడం, రోలర్ కోస్టర్ రైడ్, మెకానికల్ బుల్ మీద స్వారీ, స్కై డైవింగ్, ఆక్యుపంక్చర్, పోర్టాపాటీ అనే పబ్లిక్ టాయ్‌లెట్‌ను వాడటం వంటివి చాలానే ఉన్నాయి. వీటిల్లో కొన్ని మనల్ని కూడా భయపెట్టేవి అయితే కొన్ని నవ్వు తెప్పించేవి ఉన్నాయి. అయినా ఎవరి భయాలు వారివి. మరీ విచిత్రంగా రక్తదానం చేయడమంటే ఆమెకు ప్రాణం పోయే పనిలా తోస్తుందట. రక్తనిధికి వెళ్లేముందు 3 గంటలు ఏకాగ్రతతో ధ్యానం చేస్తేగానీ, దానం చేయలేకపోయింది. ఈ పనులన్నీ చేసేటపుడు తన హావభావాలను ప్రకటించడానికి ఈమోజీ మీటర్ అదేనంది ఎమోటికాన్స్‌ను ఉపయోగిస్తోంది. తన సాహస ప్రాజెక్ట్‌కు వెబ్‌సైట్‌ను కూడా రూపొందించి ఏ రోజుకా రోజు ఏ భయాన్ని వదిలించుకుంది, ఎంత కష్టపడింది తదితర వివరాల్ని కూర్చి ఫోబియాలతో అదిరిపడేవారికి చిట్కాలూ అంది స్తోంది.

క్రీడా పైకప్పు

ఆరు గజాల ఆటస్థలాలు లేని బళ్లెన్నో ఉన్నాయి. కనీసం క్యారమ్ కాయిన్సైనా కదిపే అవకాశం విద్యార్థులకు ఇవ్వకుండా చదువులు సాగించేస్తున్నారు. కానీ, చైనాలో వ్యాయామం లేని విద్యా బోధన సాగదు. ఏదో రకంగా ఆటలు ఆడాల్సిందే. ఇలాంటి నిబంధనల మధ్య అక్కడి తియాంతైలోని ఎలిమెంటరీ పాఠశాలకు ఓ కష్టం వచ్చింది. ఆట స్థలానికి జాగా లేకుండా భవంతులతో స్థలాన్ని నింపేశారు. ఏం చేయాలో పాలుపోని వారికి ఆర్కిటెక్ట్ రువాన్ హావో ఓ మంచి పరిష్కారం చెప్పాడు. భవంతుల పైకప్పునే క్రీడా స్థలంగా మార్చేస్తే పోలా అనడంతో నిర్వాహకులు నమ్మలేదు. కానీ, దాన్ని చేసి చూపించారు. 200 మీటర్ల చక్కని పక్కా రన్నింగ్ ట్రాక్‌ను పైకప్పుపై వేసేశారు. పిల్లలకు ప్రమాదం లేకుండా మూడు అంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. నాలుగు, ఆరు అడుగుల ఎత్తున్న దృఢమైన అద్దపు గోడలను నిర్మించి వాటి మధ్య పచ్చటి మొక్కల్ని పెంచారు. అంతటా సర్వైలెన్స్ కెమెరాలతో నిఘా ఉంచి పిల్లలను గమనిస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతమై ఆ పాఠశాలలో చదువుతున్న 1600 మంది విద్యార్థులకు చక్కగా ఉపయోగపడుతోంది. దీని గురించి తెలుసుకున్న అధికారులు వెనీస్‌లో నిర్వహించిన ఆర్కిటెక్చర్ ఎగ్జిబిషన్‌లో చైనా తరపున ప్రదర్శనకు ఉంచారు. ప్రపంచవ్యాప్తంగా దీనికి మంచి గుర్తింపు లభించింది.

స్ఫూర్తి.

అక్కడో పోటీ రోజూ మొదలవుతుంది. ఎంతో ఉత్కంఠగా సాగుతుంది. నరాలు తెగిపడే తీవ్రత. సూది మొన అంచున అడుగేసిన భావన. ఒళ్లంతా విద్యుత్ ప్రవాహం. కాళ్లంతా చచ్చుబడే ప్రమాదం. అయినా ఆ పరుగాగదు. అది గెలుపు పోరాటం కాదు. బతుకు ఆరాటం. మల్టిపుల్ స్కెలెరోసిస్ వ్యాధిని వెనక్కు నెడుతూ టచ్‌లైన్ దాటుతోన్న అథ్లెట్ కెయ్‌లా మాంటిగోమోరి జీవిత పరుగు పందెమది. జీవచ్ఛవాన్ని చేసే వ్యాధిని ఓడించాలనే పంతమది.

పరుగు పంతం

ఉత్తర కరోలినాకు చెందిన యూనివర్సిటీ విద్యార్థిని కెయ్‌లా మాంటిగోమోరి అమెరికన్ అథ్లెటిక్స్ వర్ధమాన సంచలనం. పరుగు పందెంలో దూసుకుపోతున్న ఈ యువ జీవశాస్త్ర విద్యార్థిని గురించి చాలామందికి తెలియని విషయం ఒకటుంది. ఆమె పందెం మరో దానితో అని తెలియదు. ఆ పోరాటంలో ఆమె సర్వశక్తులు ఒడ్డి ఆసరా కోసం కోచ్ చేతుల్లో వాలిపోతోందని తెలియనే తెలియదు. కెయిలా మాంటిగోమోరి నరాల సంబంధిత వ్యాధి మల్టిపుల్ స్కెలెరోసిస్‌తో పోరాటం చేస్తోంది. మెదడు, కండరాలకు మధ్య సంకేతాలనిచ్చే నరాల చివర్లు దెబ్బతిని శరీరం, బుద్ధి లయ తప్పుతాయి. దీనివల్ల కాళ్లు చచ్చుబడిపోతాయి. కండరాలు బలహీనపడి పక్షవాతానికి దారితీస్తుంది. మాట సరిగా రాదు. మానసిక రుగ్మతలకు లోనవుతారు. చివరకు ఆహారాన్ని కూడా గొట్టాల ద్వారా అందించే పరిస్థితికి దారితీస్తుంది.

జీవితం మొత్తం మంచానికే పరిమితం చేసే ఈ వ్యాధి కెయిలాకు 14 ఏళ్ల వయసున్నపుడు బయట పడింది. కెయిలా ఫుట్‌బాల్ క్రీడాకారిణి. 2009లో ప్రాక్టీస్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కాళ్లు లేనట్టు భ్రాంతి కలుగుతోందని కోచ్‌కు చెప్పింది. ఎన్నో రకాల పరీక్షలు నిర్వహించాక మెదడు, వెన్నుల్లో ఆరు సీజర్స్ ఉన్నట్టు ఎమ్మారైలో తేలింది. మల్టిపుల్ స్కెలెరోసిస్ వ్యాధి ఉన్నట్టు నిర్ధరించారు. ఆ వ్యాధిని శాశ్వతంగా పోగొట్టే చికిత్సలేదు. కెయ్‌లా బాగా కుంగిపోయింది. గదిలో ఒంటరిగా ఏడ్చేది.

ఎనిమిది నెలల పాటు నరకం అనుభవించిన ఆమె తాత్కాలిక చికిత్సతో మెల్లగా కోలుకుంది. కదలకుండా పడిన కాళ్లలో కదలిక వచ్చింది. కొన్నిరోజుల్లోనే కోచ్‌ను కలిసింది. కోచ్ క్రామ్‌వెల్ ఆమెకు ధైర్యం చెప్పాడు. నువ్వు క్రీడాకారిణివి, మంచి రన్నర్ అవుతావని నమ్మకంగా చెప్పాడు. వైద్యులు కూడా పచ్చజెండా ఊపారు. ట్రాక్ సూట్ వేసుకుని రన్నింగ్ ప్రాక్టీస్ మొదలెట్టేసింది కెయ్‌లా. కాళ్లు సహకరించకున్నా తను కసిగా వేగాన్ని అందుకుంది. కళాశాల పోటీల్లో గెలిచింది. వర్సిటీ స్థాయి అందుకుంది. పరుగాపాలనే విషయం తెలీక శరీరం అదుపుతప్పి కెయిలా కిందపడేది. అందుకే ఫినిష్‌లైన్ దాటగానే కోచ్ తన చేతుల్లోకి తీసుకుని ఆమెను కాపాడతాడు. శరీరం వేడెక్కడం వల్ల ఆమె కాళ్లు పరుగు మధ్యలోనే స్పర్శ కోల్పోతాయి. ఆ విషయాన్ని పట్టించుకోకుండా ఆ పరుగును అలా కొనసాగిస్తూ ఉంటుంది కెయ్‌లా. తీరా ఫినిష్‌లైన్ దాటగానే నిదానించాలి. అది తన చేతుల్లో ఉండదు.

రెండేళ్ల పాటు వ్యాధి తీవ్రత తగ్గుతుందని వైద్యులు చెప్పడంతో ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఆరాటం ఆమెది. కొంచెం కూడా విశ్రాంతి లేకుండా రోజూ 40 కిలోమీటర్ల రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తుంది. పోటీ తర్వాత పోటీకి సిద్ధమవుతోంది. కొన్నిసార్లు ఆమె చాలా ప్రమాదానికి గురయ్యేది. 2013లో జరిగిన 5000 మీటర్ల పరుగు పందెంలో ఆమె మధ్యలోనే కూలబడింది. వెంటనే పైకిలేచి పరుగు అందుకుని పోటీదారులను దాటి దూసుకెళ్లింది. మరో పందెంలో ఫినిష్‌లైన్ దగ్గర ఉండేందుకు కోచ్‌కు అనుమతి దొరకలేదు. వేరేవారిని ఉంచే విషయం నిర్వాహకులు మరిచిపోయారు. ఆమె కుప్పకూలిపోయింది. పక్కకు కూడా తిరగలేక అలా కాసేపు ఉండిపోయిన ఆమెను గేలరీ నుంచి దూకి కోచే వెళ్లి పైకి లేవదీశాడు. ఆ పోటీల్లో ఆమె తర్వాత దశకూ చేరుకుంది. నార్త్ కరోలినా అథ్లెటిక్స్‌లో రికార్డులను నెలకొల్పింది. 5కె రన్‌ను 17ః22 నిమిషాల్లో పూర్తి చేసి ఫుట్‌లాకర్ సౌత్ రీజనల్ చాంపియన్‌షిప్‌లో రికార్డు సృష్టించింది. పడుతూ లేస్తూ ప్రాక్టీస్ ప్రారంభించిన ఈ అమ్మాయే, 2014 న్యూయార్క్‌లో నిర్వహించిన నేషనల్స్‌లో టాప్ 8కు దూసుకెళ్లింది. తనలాగే మరెందరినో బాధిస్తోన్న ఈ వ్యాధి అంతుబట్టేందుకు లిప్స్‌కోంబ్ విశ్వవిద్యాలయంలో అణు జీవ శాస్త్రాన్ని చదువుతోంది. కెయ్‌లా మరికొన్ని రోజుల్లో వీల్ చెయిర్‌కే పరిమితం కావొచ్చు. ఆహారాన్ని కూడా గొట్టాల ద్వారా అందుకుంటూ బెడ్‌రిడెన్ కావొచ్చు. కానీ, ఈ లోగా తాను సాధిస్తున్న విజయాలతో ఆ వ్యాధిగ్రస్తుల్లో స్ఫూర్తి రగిల్చే ప్రయత్నంచేస్తోంది. అదే ప్రయత్నంలో ఆ జబ్బుకు పరిష్కారం కనుగొంటుందని ఆశిద్దాం. అయినా ఆమె ఇప్పటికే దాన్ని గెలిచేసింది.

- ప్రసన్న

సుస్వర లక్ష్మి

"వేయి శుభములు కలుగు నీకు...పోయి రావె మరదలా.

ప్రాణపదముగ పెంచుకొంటిమి నిను మరవగలేములే"

"కృష్ణార్జున యుద్ధం" చిత్రంలో సుభద్రను సాగనంపుతున్న సందర్భంలో యస్.వరలక్ష్మి పాడిన పాట మరిచిపోగలమా? ఆమె పాటలో గమ్మత్తైన గమకాలు, గండు కోయిల గర్వంగా పాడుతున్నట్టుంది ఆమె గొంతు. ఆగష్టు 13వ తేదీన 1925లో పుట్టిన సారిదె వరలక్ష్మి, యస్. వరలక్ష్మిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

పువ్వు పుట్టగానే పరమళిస్తుంది అని చెప్పడానికి ఉదాహరణ ఈమె. తొమ్మిదేళ్ళ వయస్సులో బాలవెంగిని సినిమాలో చైల్డ్ ఆర్టిస్టుగా నటిస్తున్నప్పుడు దర్శక నిర్మాతగా గూడవల్లి రామబ్రహ్మంగారి దృష్టి పడింది. 'సేవాసదనం' అనే చిత్రంలో (తమిళం) యం.యస్.సుబ్బులక్ష్మితో కలిసి నటించింది. ఆమెతో పరిచయం స్నేహంగా మారింది. తనను సంగీతం వైపు మరో మెట్టు ఎక్కేలా చేసింది. ఒక పక్క తమిళ సినిమాల్లో నటిస్తూ మరోపక్క సంగీత సాధన నిర్విరామంగా చేసేది.

అక్కినేని సరసన నటన ఓ అద్భుతం!

'బాలరాజు' సినిమాలో కథానాయికగా అక్కినేని సరసన నటించడం ఓ అద్భుతం! ఆ సినిమా సంచలన విజయం సాధించింది. మొట్టమొదట బాక్సాఫీసును బద్దలు కొట్టిన చిత్రంగా బాలరాజుని చెప్పుకోవచ్చు. ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. ప్రేక్షకులు ఎగబడి చూశారు.

సరదాగా ఆడుతూ పాడుతూ నటించిన ఆ చిత్రం అద్భుత విజయం సాధించడంతో అక్కినేని సరసన అవకాశాలు వెల్లువెత్తాయి. మాయలోకం, పల్నాటి యుద్ధం, సతీ సావిత్రి చిత్రాలు అద్భుత విజయాలు సాధించాయి. ఈ విజయ పరంపరల వలన ఒక దశలో వరలక్ష్మికి అక్కినేనికి పెళ్ళి జరగబోతోందన్న పుకార్లు షికార్లు చేశాయి. అయితే వాటిని ఇద్దరూ ఖండించారు. వరలక్ష్మికి తమిళనాడు కవిబ్రహ్మ కణ్ణదాసన్ సోదరుడు ఎ.యల్. శ్రీనివాసన్‌తో పెళ్ళి జరిగింది. గాలి వార్తలకు తెరపడింది. అక్కినేనితో నటించడం వలనే తన జీవితం ఓ అందమైన మలుపు తిరిగిందని ఆమె ఆత్మీయులతో పంచుకునేది.

తమిళ చిత్రాల్లోనూ అగ్ర కథానాయిక

యస్.వరలక్ష్మికి తెలుగులో ఎంత పేరుందో తమిళంలోనూ అంతే పేరుంది. ముఖ్యంగా భాష, గ్లామరు విషయాల్లో తమిళ దర్శక, నిర్మాతలను బాగా ఆకర్షించింది. యం.జి. రామచంద్రన్‌తో చక్రవర్తి తిరుమగళ్, మాట్టుకారవేలన్, నిధిక్కు తలైవణంగు చిత్రాలను, జెమినీతో షవైతలైవా, శివాజీగణేశన్‌తో వీర పాండ్య కట్టబొమ్మన్, రంజాన్‌తో ఎన్‌మగన్, ఆర్.ఎస్. మనోహర్‌తో 'మామియార్' ఇలా వరుస విజయాలు చవి చూసిన యస్.వరలక్ష్మి కొంత కాలం సినిమాలకు దూరంగా ఉంది. సంగీత సాధనకు కూడా విశ్రాంతినిచ్చింది.

మళ్ళీ తెలుగుచిత్రాల్లో బిజీగా

శ్రీ వేంకటేశ్వర మహత్యంలో లక్ష్మీదేవిగా నటించింది. వైకుంఠంలోంచి భూలోకం వచ్చిన తరువాత శ్రీనివాసుడి ఆకలి దప్పికలు తీర్చడానికి, గోమాతను అమ్మడానికి పల్లె పడుచులా వచ్చిన వేషంలో ఆమె అభినయం మరిచిపోలేం. 'పరాల చేరమయా.. వనరే చేరమయా, పరాకు సేయకే పదేపదే దొరకదయా' అంటూ పాడిన పాట సినిమాకి లీడ్‌గా ఉపయోగపడింది. ప్రతి

కామెడీ టచ్

పౌరాణిక, జానపద, చారిత్రాత్మకమైన చిత్రాల్లో ఎంత లోప్రొఫైల్‌లో అండర్‌ప్లే చేసిందో, కొన్ని సాంఘిక చిత్రాల్లో కామెడీ టచ్ ఉన్న పాత్రలూ అంతే సరదాగా చేసింది. 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో అప్పటికి కొత్త ఆర్టిస్టు భీమరాజు సరసన నటించి శోభనం నాటి తెల్లారి మంచం నవారునేస్తూ చిలిపి నటన సహజంగా పండించింది. 'బొమ్మా, బొరుసు'లో అత్తగారి పాత్రని మొత్తం కామెడీ టచ్‌తో చేసింది. తమిళంలో నటిగా ఆడుతూ పాడుతూ చేసేది గాని సీరియస్‌గా తీసుకొనేదికాదు. అవకాశాల కోసం వెంపర్లాడేది కాదు. వచ్చిన అవకాశాలు నచ్చితేనే ఒప్పుకొనేది.

సన్నివేశంలో శ్రీనివాసుడు శిలగా మారిన సందర్భంలో పద్మావతితో ఘర్షణపడే సన్నివేశం ఎంత సహజంగా వుందో చెప్పాల్సిన పనిలేదు. 'లవకుశ' చిత్రంలో భూదేవిగా కనిపించింది కాసేపే అయినా గుండె ఝల్లుమనిపిస్తుంది. పతాక సన్నివేశంలో సీతమ్మ (అంజలీ దేవి)ని భూగర్భంలోకి స్వాగతించడం.. శ్రీరాముడు విలపించడం... లవకుశ చిత్రం. 'సత్యహరిశ్చంద్ర' చిత్రంలో ఎన్.టి.ఆర్. సరసన నటించి ప్రేక్షకుల్ని కంటతడి పెట్టించింది. ముఖ్యంగా 'నమో భూతనాథా నమో దేవదేవ' పాట ఇప్పటికి శివాలయాల్లో మార్మోగుతూనే ఉంటుంది. చాలామంది ప్రముఖ రంగస్థల నటుల ప్రశంసలు పొందింది. 'శ్రీ కృష్ణావతారం' చిత్రంలో ద్రౌపదిగా, ముఖ్యంగా వస్త్రాపహరణం సన్నివేశంలో అద్భుతమైన నటన కనపరిచింది. 'మహా మంత్రి తిమ్మరసు' చిత్రంలో 'తిరుమల తిరుపతి వేంకటేశ్వర.. కోరిన వరములు కురియుమయా..' పాట మరిచిపోగలమా?

కొన్ని ఆణిముత్యాలు

బాలరాజు, మాయాలోకం, పల్నాటి యుద్ధం, సతీ సావిత్రి అక్కినేనితో, నాగపంచమి చిత్తూరు వి.నాగయ్యతో, శ్రీ వేంకటేశ్వర మహత్యం, ఎన్.టి.ఆర్‌తో కృష్ణప్రేమ, మహామంత్రి తిమ్మరుసు కృష్ణార్జున యుద్ధం, శ్రీకృష్ణ పాండవీయం ,ప్రేమ్‌నగర్, బాలభారతం, దేవుడు చేసిన మనుషులు, యశోదకృష్ణ, దానవీర శూరకర్ణ, నేటి భారతం చెప్పుకోదగ్గ చిత్రాలు. సహజమైన నటన ప్రదర్శించడంలో యస్. వరలక్ష్మి ముందుండేది. డ్రెమటైజ్ చెయ్యాలంటే ఆమడ దూరంలో వుండేది. ఇది కొంతమంది నిర్మాత దర్శకులకు దూరంగా ఉంచింది.

అవార్డులూ, రివార్డులూ

తమిళనాడు స్వచ్ఛంద సేవా సంస్థలు లెక్కలేనన్ని అవార్డులతో సత్కరించింది. అందులో ప్రత్యేకించి చెప్పుకోదగ్గ అవార్డు 'కలై మామణి' ప్రభుత్వ అవార్డు జయలలిత చేతుల మీదుగా అందుకుంది. ఈ అవార్డుతో బాటు జయలలిత పది లక్షల క్యాష్ ప్రైజ్ కూడా ఇవ్వడం విశేషం. దీంతోపాటు శివాజీ గణేశన్ మెమోరియల్ అవార్డు, కన్నదాసన్ అవార్డు చెప్పుకోదగ్గవి.

కోపమే శత్రువైంది

యస్.వరలక్ష్మికి తొందరపాటెక్కువ. ప్రతి చిన్న విషయానికి వెంటనే స్పందించేది. గోరంతల్ని కొండంతలు చేసి భూతద్దంలోంచి చూసి గొడవపడేది.

మనసులో వున్నది మొహం మీద అనేసేది. తెలుగు, తమిళ రంగాల్లో చాలా మంది ప్రముక దర్శక, నిర్మాతలకు దూరమైంది. పాటలు పాడమని ఎందరో ప్రాధేయపడేవారు. తన పాత్రలకి తప్ప.. ఇతర పాత్రలకు పాడటం గాని, ఆల్బమ్ తయారుచేయడం గాని, సంగీత కచేరీలు ఇవ్వడం గాని చేసేది కాదు. జీవితంలో ఊహించని మలుపు ఆర్థికంగా పతన మవ్వడం. ముదిమి వయసులో వేషాల కోసం ప్రయత్నాలు చెయ్యలేదు. అందరూ భాగ్యనగరానికి తరలి వచ్చినా తను మాత్రం చెన్నపట్నం విడిచిపెట్టి రాలేదు. చివరి రోజుల్లో జయలలిత ఆదుకుంది.

భర్త పోవడం, కొడుకు అనారోగ్యం పాలవడంతో కష్టాల్ని ఎదుర్కుంది. వెన్నుపూస సమస్యతో మంచానపడి.. ఆరుమాసాలు మంచంమీదే ఉండి 2009 సెప్టెంబరు 22న మరణించింది. ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో చిక్కుకున్న వరలక్ష్మి చివరి రోజుల్లో పశ్చాత్తాపంతో తనను తాను సమాధాన పరుచుకుంది. చిత్రాలున్నంత కాలం వగరూ పొగరూ తగ్గకుండా బతికింది. యస్! దటీజ్ వరలక్ష్మి.

ఇమంది రామారావు
9010133844

నవ్వుల్ – పువ్వుల్



ఓరి గాడిద!

టీచర్ః మనిషికి గాడిదకు తేడా ఏంటి?

స్టూడెంట్ః మనిషి గాడిదవగలడు కానీ, గాడిద మనిషి కాలేదు సార్.

టీచర్ః ఓరి గాడిదా!

స్టూడెంట్ః చూశారా సార్. నేను చెప్పింది నిజమే.

సెల్ సామెతలు

- ఎంత చెట్టుకు అంతగాలి – ఎంత రీచార్జీకి అంత టాక్‌టైం.
- పిండికొద్దీ రొట్టే – ఫోన్ కొద్దీ ఫీచర్స్.
- ముందొచ్చిన కొమ్ములకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి – ఇంట్లో ల్యాండ్ ఫోన్ కన్నా చేతిలో సెల్‌ఫోన్ పైనే మోజెక్కువ.
- ఆరిపోయే దీపానికి వెలుగెక్కువ – చైనా పీసుకి స్టాండ్ బై ఎక్కువ.
- పిట్ట కొంచెం కూత ఘనం – మొబైల్ చిన్నది, మెమొరీ గొప్పది.

చీకటి

ఇద్దరు ఫ్యాక్టరీ వర్కర్స్ ఇలా మాట్లాడుకుంటున్నారు.

మొదటివాడు: నేను ఎలాగైనా ఓనర్ చేత ఇవ్వాళ సెలవు ఇప్పించుకుంటా.

రెండవవాడు: అదెలాగా?

(ఇంతలో ఆ ఫ్యాక్టరీ ఓనర్ రావడం గమనించి మొదటివాడు ఫ్యానుకి వేలాడుతుంటాడు.)

యజమాని: అక్కడేం చేస్తున్నావ్?

మొదటివాడు: నేను లైటుని....

యజమాని: నీకు పనెక్కువ చెయ్యడం వల్ల బుర్ర పాడైనట్టుంది గానీ ఇంటికి వెళ్లి రెస్ట్ తీసుకో.

రెండవవాడు కూడా మొదటివాడిని అనుసరిస్తూ బయలుదేరాడు.

యజమాని: నువ్వెక్కడికిరా?

రెండవవాడు: ఇంటికి వెళ్తున్నా అయ్యగారు. నేనీ చీకటిలో పనిచెయ్యడం నా వల్ల కాదు.

ఒకటే పాట

తండ్రి: డాక్టర్‌గారు.. డాక్టర్ గారు! ఏమైందో ఏమో కానీ, నిన్నట్నించి మావాడు ఒకే పాటను మాటిమాటికీ పాడేస్తున్నాడు. ఆ పాట వినలేక చస్తున్నాం.

ఆస్పత్రిలో కుర్రాడి ఛాతీ, ఉదరం పరిశీలించాడు డాక్టర్.

డాక్టర్: మీవాడు సెల్‌ఫోన్ మింగాడయ్యా. దానికి ఫోన్లు వచ్చినపుడల్లా కడుపులో రింగ్‌టోన్ మోగుతోంది. కొన్నాళ్లు ఫోన్లు రాకుండా చూడండి.

బామ్మ -కుక్కపిల్ల

ఆఫీసు పని మీద నెల రోజులు క్యాంపువెళ్ళిన జంబు లింగానికి ఫోన్ చేశాడు కొడుకు సోమ లింగం.

"అందరూ బాగున్నారు కదా!" అడిగాడు తండ్రి జంబు లింగం.

"మన కుక్క పిల్ల చనిపోయింది నాన్నా" చెప్పాడు కొడుకు.

షాక్ తిన్నాడు జంబు లింగం. మెల్లిగా తేరుకొని "ఇలాంటి వార్తలను ఒక్కసారిగా చెప్పకూడదు. ముందు కుక్క పిల్ల గోడెక్కింది అని చెప్పాలి. తరువాత అక్కడి నుండి పడింది. కాలు విరిగింది హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం. లాభం లేకపోయింది. అని మెల్లగా చెప్పాలి. సర్లే ఏం చేస్తాం. ఇంతకీ బామ్మ ఎలా ఉంది" అడిగాడు జంబులింగం.

ఒక్క క్షణం ఆలోచించి "బామ్మ గోడెక్కింది నాన్నా!" చెప్పాడు సోమలింగం.

మండే సూర్యుడు



ప్రసాద్, సూర్య మగధీర సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు.

అందులో అఘోరా చెప్పిన డైలాగ్‌ని సూర్యతో చెబుతున్నాడు ప్రసాద్.

"వాడు మండే అగ్నిగోళంలా కనిపిస్తాడు..."

ఇంతలో...

"మరి ట్యూస్‌డే ఎలా ఉంటాడు?" అడిగాడు సూర్య.

ఒళ్ళు మండిన ప్రసాద్ నువ్వింకొక నాలుగొందలేళ్లయినా మారవా అన్నాడు.

రిక్షా యాత్ర

హిమాలయాల యాత్రే ఓ ఉత్కంఠ. సబ్‌జీరో డిగ్రీ ఉష్ణోగ్రతల్లో ఉక్కిరిబిక్కిరి చేసే అక్కడ ఆక్సిజన్ అందడం కష్టమే. ఎంతో సరంజామా సర్దుకుంటే గానీ ఆ సాహస యాత్ర సుఖాంతం కాదు. మోటార్ వాహనాలు, గుర్రాలు, పల్లకీ మోత లేకుండా లధక్ దారుల్ని దాటలేం. కానీ, సత్యేన్ దాస్ హిమాలయ యాత్రను రిక్షా తొక్కేశాడు. ఏకంగా కోల్‌కతా నుంచి మొదలెట్టి 3000 కిలోమీటర్లు రిక్షా తొక్కుతూ కర్డుంగ్లా పాస్‌ను దాటేశాడు.

గరియా పక్కనుండే దక్షిణ గరియా గ్రామానికి చెందిన సత్యేన్ దాస్ ప్రయాణించింది 68 రోజుల్లో సుమారు 3000 కిలోమీటర్ల దూరం. సముద్ర మట్టానికి 17,582 అడుగుల ఎత్తున ఉండే ఈ ప్రాంతంలో మోటార్ బైక్ మీద వెళ్లడం కూడా ప్రమాదకరమే. ఎంతో మంది యువత దీన్ని చాలెంజ్‌గా తీసుకుని బైక్ సాహస యాత్రలు చేస్తారు. ఈ రకంగా చూస్తే సత్యేన్‌ది ప్రత్యేక యాత్ర. శరీరం బిగదీసుకుపోయేంత చలిలో రిక్షాను తొక్కడం అంటే మామూలు విషయం కాదు. శరీరంలోని ఉష్ణాన్ని కోల్పోకుండా కట్టుదిట్టమైన దుస్తుల్ని ధరించి గానీ ఆ ప్రాంతాల్లో నడవలేరు. అలాంటిది విపరీత శారీరక శ్రమకు గురిచేసే రిక్షా ప్రయాణం చేశాడతడు. మంచుతో జారిపోయేట్టుగా ఉండే రోడ్డు, ఇరుకైన మలుపులు, లెక్కలేనన్ని ఎత్తులు, పల్లాలను దాటుకుని, వాలుగా ఉండే పర్వత ప్రాంతాల్లో కాస్త అజాగ్రత్తగా ఉన్నా వేల అడుగుల లోయలో పడే అవకాశముంది. అక్కడ ఈ తరహా ప్రమాదాలు ఎక్కువే. జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, శ్రీనగర్, కార్గిల్ మీదుగా సాగిన ఈ యాత్రలో ఆయనకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. ప్రాణాపాయాలు సంభవించాయి. హరిద్వార్ దగ్గరలోని జింప్లీ అడవికి చేరిన ఆయన ఓ రాత్రి అడవికి సమీపంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఏనుగుల గుంపు బారిన పడ్డాడు. అక్కడి నుంచి తప్పించుకున్న అతనికి కొన్ని రోజుల తర్వాత సోన్‌మార్గ్‌లో ఆసియా నల్ల ఎలుగుబంటి ఎదురైంది. లేహ్‌లో అయితే మంచు చిరుతతో ముఖాముఖి సందర్భం ఎదురైంది. అదృష్టవశాత్తు ఏవీ అతనిపై దాడి చేయలేదు. ఇలా క్రూర మృగాలతోను సమస్యలు ఎదురయ్యాయి. వీటన్నింటినీ దాటుకుని వెళ్లిన సత్యేన్ యాత్ర లక్ష్యం ప్రపంచ శాంతి. ఎకో ఫ్రెండ్లీ వాహనాల ప్రచారం. ఆ బ్యానర్లను కట్టుకుని శాంతిని ప్రచారం చేస్తూ యాత్ర సాగించాడు. కోల్‌కతా నుంచి కర్డుంగ్లా పాస్ వరకు చేరుకున్నాడు. ఈ ప్రయాణంలో ఆహ్లాదకరమైన విషయాల్ని చవిచూశాడు. కాశ్మీర్లో జమ్మూ కాశ్మీర్‌లోని పఠన్‌కోట్ దాటగానే అక్కడి వారు తాము ఎప్పుడూ అలాంటి వాహనాన్ని అదే రిక్షాను చూడలేదని ఆశ్చర్యపోయారట. కొందరు పర్యాటకులు, స్థానికులు సత్యేన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు కూడా.

నలభై నాలుగేళ్ల సత్యేన్ దాస్ ఓ రిక్షా పుల్లర్. ఆయనకు యాత్రలంటే మక్కువ ఎక్కువ. కానీ తన చాలీ చాలనీ సంపాదనతో ఇల్లు గడవడమే కష్టం, ఇక దూరాన ఉన్న ప్రాంతాలకు వెళ్లడం అనేది ఓ కలే. ఆ కలను ఎలాగన్నా నిజం చేసుకోవాలనుకున్న సత్యేన్‌కు ఓ ఆలోచన వచ్చింది. డబ్బు ఖర్చుచేయలేని తను తన పిక్కల కష్టాన్నే నమ్ముకున్నాడు. సైకిల్‌పై దేశ యాత్రను 22 ఏళ్లకే ప్రారంభించాడు. నిలువుగా, అడ్డంగా దేశాన్ని చుట్టొచ్చాడు. ఆ యాత్రలో ఆయనకు జీవితం మీద విశాల దృక్పథం అలవరింది. అప్పటి దాకా తనూహించుకున్నదానికి విశాల ప్రపంచం నేర్పిన విషయాలకు పొంతన లేదని గమనించిన ఆయనకు యాత్రలపై మరింత గౌరవం పెరిగింది. ఇదే విషయాన్ని కుటుంబానికి పంచాలని తన భార్య పిల్లల్ని తీసుకుని పూరీ వరకు ఆ తర్వాత రోహ్‌తంగ్‌కు రిక్షా ప్రయాణం కట్టాడు. ఆ సందర్భంలోనే ఆయనకు హిమాలయాల వరకు రిక్షా తొక్కుతూ వెళ్లగలడనే నమ్మకం కుదిరింది. ఎలాగైనా హిమాలయాలను తన పెడల్‌తో జయించాలని అనుకున్నాడు. దక్షిణ కోల్‌కతాలోని నక్షాల అగ్రాణి క్లబ్ వారు 80 వేల రూపాయల్ని అందించారు. తను కొంత సొమ్మును కూడబెట్టి యాత్ర ప్రారంభించాడు. ఆ విధంగా హిమాలయ యాత్రను పూర్తిచేశాడు. అసాధ్యం అనుకునేవారికి తాను చెప్పేది ఒకటే ప్రపంచం ముందు మనం నలుసంతే కనిపించొచ్చు కానీ, మన సంకల్పం, పోరాటం ముందు క్రమంగా అఖండ దూరం తగ్గిపోతుంది. అపార లక్ష్యం చిన్నబోతుంది. తాను సాగించాల్సిన బృహత్తర యాత్రను జ్ఞప్తికి తెచ్చుకుని కుదేలైపోకుండా, తర్వాత మైలు, తర్వాతి మలుపు వరకే ఆలోచనల్ని పరిమితం చేశాడట. తీరా వెనక్కు తిరిగి చూసుకుంటే ఎన్నో మైళ్లు కరిగిపోయేవట. నిజమే దీన్ని మన కష్టాలకు, లక్ష్యాలకు అన్వయించుకోవచ్చు. చూడ్డానికి మనల్ని మింగేసంతవి కనబడేవే ప్రయత్నం పెరుగుతున్న కొద్దీ క్షీణించుకుపోతాయి. అంతిమ విజయం రాజీలేని ప్రయత్నానిదే అవుతుంది. తెగువ, మనోబలం, తపన విజయ విజయ రహస్యాలవుతాయి. ఎంతటి లక్ష్యమైనా వాటి ముందు మోకరిల్లుతుంది.



గరం గరం చికెన్

చికెన్ బాల్స్

కావలసిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్–200 గ్రా
అల్లం ముక్కలు–1 స్పూన్
ఉల్లిపాయ ముక్కలు– 2 టేబుల్ స్పూన్లు
మెంతు ఆకు తరిగినది– 1 టేబుల్ స్పూన్
పచ్చి మిరపకాయల తురుము– 1 టీ స్పూన్
దంచిన లవంగాలు–2
కారం –అర స్పూన్లు
మసాలా–అర స్పూన్
ఉప్పు–తగినంత

తయారు చేయు విధానం

ముందుగా చికెన్ ముక్కలు మిక్సీలో వేసి బాగా మెత్తగా కైమాలా చేసుకోవాలి. తరువాత సిద్ధం చేసి ఉంచుకున్న అల్లం, ఉల్లి, పచ్చి మిరపకాయల మిశ్రమాన్ని కైమాకు దట్టించి బాగా కలపాలి. ఈ ముద్దను చిన్న చిన్న ఉండలు గా చేసి ఆవిరిపై ఉడికించాలి. ఉడికిన తరువాత ఆ బాల్స్ పైన సూప్ వేసుకుని తింటే చాలా రుచిగా ఉంటాయి.

మెంతి చికెన్

కావలసిన పదార్థాలు

చికెన్–అర కిలో
కస్తూరి మెంతి–2 టేబుల్ స్పూన్లు
కొత్తిమీర తురుము– టేబుల్ స్పూను
నూనె– 2 టేబుల్ స్పూన్లు
పసుపు–టీ స్పూను
పెరుగు – కప్పు
పలావు ఆకులు–2
అల్లం తురుము– 2 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి తురుము– 2 టేబుల్ స్పూన్లు
గరం మసాలా– 2 టేబుల్ స్పూన్లు
ధనియాల పొడి– 2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయలు– రెండు
పచ్చిమిర్చి తురుము– 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు– సరిపడా

తయారు చేయు విధానం

చికెన్ ముక్కల్ని శుభ్రంగా కడగాలి. బాణలిలో నూనె పోసి వేడి చేయాలి. పలావు ఆకులు, గరం మసాలా వేయాలి. తరువాత ఉల్లిముక్కలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి తురుము, పసుపు, ధనియాల పొడి, పచ్చి మిర్చి వేసి వేయించాలి. చికెన్ ముక్కలకు గిలకొట్టిన పెరుగు వేసి సుమారు పది నిమిషాలపాటు కలుపుతూ వేయించాలి. తరువాత కస్తూరి మెంతి, గరం మసాలా, కొత్తిమీర తురుము, ఉప్పు, నీళ్ళు పోసి కలపాలి. మూత పెట్టి తక్కువ మంట మీద ముక్క ఉడికే వరకూ ఉంచి దించాలి.

సికిందరీ రాన్

కావలసిన పదార్థాలు

మటన్ జాయింట్–ఆరు వందల గ్రాములు
కారం– ఇరవై గ్రాములు ,అల్లం వెల్లుల్లి ముద్ద, కశ్మీరీ కారం– యాభై గ్రాముల చొప్పున, మిరియాల పొడి, లవంగాలు, బిర్యానీ ఆకు– ఐదు గ్రాముల చొప్పున,గరంమసాలా– రెండు గ్రాములు అవనూనె–వంద ఎంఎల్,పెరుగు–మూడు వందల ఎంఎల్,ఉప్పు–రుచికి తగినంత

తయారు చేయు విధానం

ముందుగా కశ్మీరీ కారం, అల్లం వెల్లుల్లి ముద్ద, ఉప్పు తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మటన్ జాయింట్‌కు పట్టించి ఫ్రిజ్‌లో కనీసం ఆరు గంటలపాటు ఉంచాలి. వెడల్పాటి పాత్ర తీసుకుని అందులో రెండు లీటర్ల నీరు చేర్చి, మిగిలిన పదార్థాలు, మటన్ జాయింట్‌ను ఒక దాని తరువాత ఒకటి వేసేయాలి. పాత్రకు సిల్వర్ ఫాయిల్ చుట్టాలి. దీన్ని నూట అరవై డిగ్రీల్లో ముందే వేడిచేసిన ఓవెన్‌లో కనీసం గంటం బావు ఉంచాలి. అయితే మరీ ఉడక్కుండా మధ్య మధ్య గమనిస్తూ ఉండాలి. ఎముక నుంచి మటన్ వేరు పడుతున్నప్పుడు సాస్‌ని తీసేయాలి. దీన్ని మళ్లీ ఇనుప చువ్వకు గుచ్చి నిప్పులపై కాల్చాల్సి ఉంటుంది. ఆ తరు వాత పైన మిగి లిన సాస్ వేసి వడ్డిస్తే చాలు.

నీరుల్లి కోడి



కావల్సిన పదార్థాలు

చికెన్–ఎనిమిది వందల గ్రాములు
చిన్నగా ఉండే ఉల్లిపాయలు–మూడు వందల గ్రాములు
అల్లం– ముప్పై గ్రాములు
వెల్లుల్లి తరుగు–నలభై గ్రాములు
కరివేపాకు–పది గ్రాములు
టమాటా రసం– వంద ఎంఎల్
కారం–ఇరవై ఎంఎల్
పసుపు–రెండు గ్రాములు
ధనియాలపొడి–పదిహేను గ్రాములు
గరం మసాలా–రెండు గ్రాములు
ఉప్పు– సరిపడా
నూనె–వంద ఎంఎల్
కొత్తిమీర తరుగు–కొద్దిగా

తయారు చేయు విధానం

చికెన్‌ను ముక్కల్లా తరిగి పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేడి చేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి పలుకులు, అల్లం తరుగు వేయాలి. ఉల్లిపాయలు బంగారు వర్ణంలోకి వచ్చేదాకా వేయించాలి. ఇప్పుడు కారం, ధనియాలపొడి, పసుపు చల్లి ఆ వెంటనే టమాటా రసం, కరివేపాకు సరిపడా ఉప్పు చేర్చాలి. నూనె పైకి తేలాక చికెన్ కలిపితే సరిపోతుంది. దీన్ని వేడి వేడిగా తింటే ఈ రుచే వేరు.

నీళ్లు మోయడానికే....

ఆ మారు మూల పల్లెలో 'బహు భార్యత్వం' నేటికీ వర్ధిల్లుతోంది. నయా బానిసత్వం బహిరంగంగా దర్జాగా సంచరిస్తోంది. మగవాళ్లు నాలుగేసి ఐదేసి పెళ్లిళ్లు చేసేసుకుంటున్నారు. కాకపోతే మొదటి భార్యకే హక్కులన్నీ. మిగతా వారంతా కేవలం సేవకులే. వారికి ఎలాంటి సుఖసంతోషాలు, గుర్తింపు వుండదు. కేవలం ఆ కుటుంబానికి కావాల్సిన నీళ్లను మోసుకురావడమే వీరి పని. ఔను! నీళ్లు తీసుకొచ్చేందుకే అన్నేసి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు పురుషపుంగవులు!

దేశ ఆర్థిక రాజధాని ముంబైకి 150 కిలోమీటర్ల దూరంలో వుంది డెంగన్మాల్ అనే గ్రామం. ఇక్కడి మగవాళ్లు వ్యవసాయం, పశువుల పెంపకం బాధ్యతలు చూస్తారు. ఆడవాళ్లు ఇళ్లల్లో పిల్లల పెంపకం, వంట పనులతో సతమతమౌతుంటారు. ఇది అన్ని చోట్లా వున్నదే కదా అనిపించొచ్చు.

ఈ గ్రామం పూర్తిగా కరువు ప్రాంతాన్ని పోలి వుంటుంది. ఒక్కోసారి ఏడాదికి ఎనిమిది నెలల పాటు వాన చుక్క పడదు. ఎప్పుడు చూసినా నేల నెర్రెలిచ్చే కనిపిస్తుంది. దాంతో తాగునీరు కోసం, వాడుక నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణించాలి. అందుకోసం మగవాళ్లు అనేక పెళ్లిళ్లు చేసుకుంటారు. తమకు మాదిరిగానే కరువు ప్రాంతానికి చెందిన అమ్మాయిలకే ప్రాధాన్యతనిస్తారు. వారికైతే నీటి విలువ బాగా తెలుసని, ఎంత దూరమైనా వెళ్లి నీళ్లు మోసుకొస్తారని విశ్వాసం. పైగా వితంతువులను, భర్తలు వదిలేసిన ఆడవాళ్లను ఎంచుకుంటారు. వీరికి తాళి కట్టి... కేవలం ఇంత తిండి పెట్టి...కాస్త నీడనిస్తే చాలు. హక్కుల నుంచి పడక సుఖాల వరకు ఏవీ ఇవ్వనవసరం లేదు. బానిసల్లా పగలు రాత్రి, ఎండ వాన అన్న తేడాల్లేకుండా బిందెలతో నీళ్లు మోస్తూనే వుంటారు. మూడు కిలోమీటర్ల దూరానున్న చెరువుల నుంచి రోజుకి వంద లీటర్ల నీరు చేరవేస్తుంటారు. అందుకోసం పలుమార్లు వెళ్లిరావాల్సి వుంటుంది. అల్యూమినియం బిందెలను నెత్తిమీద పెట్టుకుని ... 40 డిగ్రీల సెల్సియస్ ఎండలో .... నీళ్లు మోయాలి. ఈ విధంగా ఏళ్ల తరబడి పని చేయడం వల్ల మహిళలకు బట్టతల వచ్చేస్తుంది. పిల్లలను కనే శక్తి కూడా నశిస్తుంది. నీళ్లు మోయడం కోసం చేసుకున్న తొలి భార్య ముసలిదైనా, శక్తి తగ్గినా వయసులో వున్న అమ్మాయిని మళ్లీ పెళ్లి చేసుకుంటారు. తనైతే ఓపిగ్గా మరింత శ్రమ చేసి పెడుతుంది కదా!

భాగి గాథ

శఖారామ్ భగత్‌కు ముగ్గురు భార్యలు. 'టుకి' మొదటి భార్య. అతని అసలు భార్య ఈమే. ఆ తర్వాత శక్రి, భాగిని పెళ్లాడాడు. వీరికి ఆరుగురు పిల్లలు. అంతా 'టుకి' సంతానమే. రెండు, మూడవ భార్యలు కేవలం నీళ్లు మోసుకురావడానికే. కాకపోతే అందరూ ఒకే కప్పు కిందే కాపురముంటారు. టుకి గర్భం దాల్చినప్పుడు నీళ్లు తేవడం, ఇంటి పనులు చూసుకోవడం కష్టమైంది. ఆ పనులతో పాటు పొలంలో సాయం చేయడానికి శక్రిని రెండవ పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తర్వాత ఆమె వయోభారంతో దూరాలు నడిచి నీళ్లు మోసుకురాలేకపోయింది.

దాంతో భాగిని మూడవ పెళ్లి చేసుకున్నాడు శఖారామ్. ఇప్పుడా ఇంటి మొత్తానికి కావాల్సిన నీళ్లను మోసుకొచ్చే భారం మూడవ భార్య అయిన భాగి మీద పడింది.

ముగ్గురు భార్యలతో శఖారామ్

'పానీ' పట్టు

ఊళ్లోకి ప్రతి ఐదు రోజులకు వెయ్యి లీటర్ల మంచి నీళ్ల ట్యాంకర్ వస్తుంది. అది వచ్చిన ప్రతిసారీ హోరాహోరీగా వుంటుంది వ్యవహారం. శిఖ పట్లూ, చేతి వాటాలూ, నోటి దురుసుతనమూ అన్నీ కనిపిస్తాయి. ఎలాగైనా సరే ట్యాంకర్ నుంచి ఎక్కువ బిందెలు నీళ్లు తామే నింపుకోవాలన్న తపనే అందుకు కారణం. ఒకవేళ ఆ పానీపట్టులో వెనకబడ్డారో... చచ్చినట్టు మైళ్లకు మైళ్లు నడుచుకుంటూ పోయి నీళ్లు మోసుకురావాల్సిందే.

క్షీణించే ఆయుష్షు

నీళ్ల కోసం దూర తీరాలు నడిచీ నడిచీ ... సమయానికి తినీ తినకపోవడంతో వారిలో రక్తహీనత పెరిగిపోతోంది. మెడ, వెన్ను నొప్పి పట్టుకుంటున్నాయి. బాలింతలు పసిపిల్లలను ఇళ్లలో వదిలి నీళ్లకు వెళ్లాల్సి రావడంతో... శిశు మరణాలు కూడా పెరిగిపోతున్నాయి. నీటి కొరత కారణంగా రెండు వారాలకోసారి బట్టలు ఉతకాల్సి రావడంతో పరిశుభ్రత లోపించి రోగాలు వెంటబడుతున్నాయి.

ఇప్పటికిలా గడిచినా ముందు ముందు తమ ఆడపిల్లలకు ఈ నీటి కష్టాలు వుండకూడదని, పైపు నీరు అందితే బాగుండనీ గ్రామస్తుల ఆశ. ఇంతమంది మహిళల జీవితాలు నీళ్ల బిందెల మోతతో, బహుభార్యత్వపు బానిసత్వంలో మగ్గుతున్నా మహారాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోదనేది అంతుబట్టని ప్రశ్న.

✦



గజరాజ వైభోగం

కేరళ సంస్కృతిని గజరాజులూ మోస్తున్నాయి. దేవాలయాలు నిర్వహించే ఉత్సవాల నుంచి సాంప్రదాయక వివాహాల వరకు వాటి ఘీంకార శబ్దం, తొండమెత్తి ఆశీర్వదించడం ఉండాల్సిందే. గజేంద్రుడు లేనిదే ఏ ఉత్సవం అలంకారమవదు. ఖరీదైన వస్త్రాలు, ఆభరణాలు, అలంకారాలు ధరించి అవి ఆనతినివ్వాలంటే లక్షలు సమర్పించుకోవాల్సిందే. అదీ ఒక్క రోజు అవి పాల్గొన్నందుకు.

అంతెత్తున ఠీవిగా ఎదురొచ్చి తమ ఉత్సవాలకు, వివాహ కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే వీరగజాలను స్వాగతించడానికి కేరళవారు ఎన్ని లక్షలనైనా ముట్టజెప్పేందుకు వెనక్కాడటం లేదు. పెళ్ళిళ్లు, ఇతర ఉత్సవాలకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చే ఈ ఏనుగుల రోజు అద్దె వాటి ఆకారానికి తగ్గట్టు లక్ష నుంచి 4.5 లక్షల రూపాయల మధ్య ఉంటోంది. తరచూ ఏనుగు బీభత్సాలకు వీక్షకులు బలైపోతున్న ఘటనలు జరుగుతున్నా వాటికి ఆదరణ మాత్రం తగ్గడంలేదు. ఒక్కో ఏనుగుకు ప్రత్యేక అభిమాన సంఘాలు వెలిసి అక్కడి సినీ స్టార్ల ఇమేజ్‌ను పక్కన పెట్టేస్తున్నాయి. గజరాజన్, గజరత్నం, గజాధిపతి, కలభ కేసరి, గజ వీరన్, మాతంగ చక్రవర్తి, గజేంద్రన్ అని వాటికి బిరుదులు తగిలిస్తున్నారు. అయితే వీటిని కొనుక్కుని పాపులారిటీ తెచ్చుకునే యజమానులే ఎక్కువ. ఈ సెలబ్రెటీ స్టేటస్ లేకపోతే అంత గిట్టుబాటు కాదు, మరి. ఈ ప్రత్యేక బిరుదుల వల్ల ఆలయ మండళ్లకు, ఉత్సవ నిర్వాహకులకు తల బొప్పికడుతోంది. సీజన్ సీజన్‌కు వాటి అద్దె ధర అమాంతం పెరిగిపోతోంది.

అసలీ కొత్త ట్రెండ్ ఎక్కడి నుంచి వచ్చిందంటే, కోచి మహారాజా త్రిస్సూర్‌లో నిర్వహించే ప్రసిద్ధ ఉత్సవం అరత్తుపూజా పూరమ్‌లో పాల్గొన్నప్పుడు అక్కడ హుందాగా రాచరికం ఒలకబోస్తున్న ఉత్సవ ఏనుగును చూశాడు. వెంటనే దానికి గజరాజ బిరుదునిచ్చేశాడు. అప్పటి నుంచి ఆ ఏనుగు అద్దె అమాంతం పెరిగిపోయింది.

ఇదే పద్ధతిని వేరే గజ యజమానులు పాటించేశారు. ఒకప్పుడు జరిగిన ఏనుగుల వర్తకమైన గజమేళాల్లో వాటి ఆకారం, ఎత్తు, చెవుల తీరు తదితరాలను కొలిచి ఫీజు వసూలు చేసి ఈ బిరుదు పేర్లను ఇచ్చేవారు. ఏనుగుల అద్దెలు పెరిగిపోవడానికి మరో కారణం, కఠినమైన జంతు సంరక్షణ చట్టాలు అమల్లోకి రావడమే. వాటి వర్తకాన్ని కేరళలో నిషేధించారు. కొత్తవాటిని అడవి నుంచి తేవడం ఇప్పుడు చాలా కష్టం. కొన్నాళ్ల క్రితం 40 లక్షల వరకు పలికిన ఏనుగుల ధర, ఇప్పుడు కోటిన్నర రూపాయలకు చేరుకుంది. ఇక 25 – 40 ఏళ్ల మధ్య వయసున్న కుర్ర ఏనుగులకు 4 కోట్ల రూపాయల్ని చెల్లించుకోవాల్సిందే. ఈ వర్తకం కూడా చాలా రహస్యంగా లీజు రూపంలో జరుగుతోంది. ఇప్పుడు ఏనుగులను పోషిస్తున్న చాలా మంది యజమానులు చట్టప్రకారం వాటి సొంతదార్లు కారు. కేరళలో అధికారికంగా అనుమతి ఉన్న పెంపుడు ఏనుగుల సంఖ్య 400 కంటే తక్కువే. ఇవే ప్రతి ఏటా నిర్వహించే 3000 ఉత్సవాలు, తదితర కార్యక్రమాల్లో పాల్గొనాలి. గజరాజులు దాడులు చేసి గత ఆరేళ్లలో 560 మందిని పొట్టనబెట్టుకున్నా మళ్లీ వాటినే ఉత్సవాలకు తీసుకురావాల్సిన పరిస్థితి. ఇంకా విడ్డూరమేమిటంటే గత సీజన్లో అత్యధిక అద్దె ధర 4.3 లక్షల రూపాయలు పలికిన ఏనుగు ‘తేచికొట్టుకవు రామచంద్రన్’ ఇద్దరు మావటిలను, పది మంది వీక్షకులను చంపిన సీరియల్ కిల్లర్. కానీ, అదే ఉత్సవాల్లో స్టార్ అట్రాక్షన్. మొత్తం కేరళ గజరాజుల్లోనే సూపర్ స్టార్. ఇదీ కేరళలో ఏనుగుల ఆధిపత్యం, వైభోగం.

ఆర్ట్ ఫీచర్

రంగుల కళకలం

మారుమూలన దాక్కుని చప్పుడు చేయని వీధి, రాత్రికి రాత్రే రంగులద్దుకుని కళ-కలం సృష్టిస్తే. బీటలు వారి, వెల్ల వెలసి మోడైన గోడ, సూరీడు రంగు తొడిగే లోపు కళనద్దుకుని చిత్తరువై వెల్లివిరిస్తే. పిట్ట గోడలు వాస్తవ కథను అల్లితే. వీధి జీవన నాటకాన్ని రచిస్తే. గ్రాఫిటీ గుర్తొచ్చి మనస్సుల్లోకి తొలుచుకుపోతుంది. అది సమాజంపై ముద్ర వేస్తూ విస్ఫోటన మౌతుంది. 'విప్లవం వర్ధిల్లాలి' నినాదానికి గొంతుకైనా, 'యుద్ధం వద్దు' నిరసనకు ప్రదర్శన అయినా, అందంగా విప్పార్చే పూరేకైనా, సందేశంగా విడమర్చే సులేఖైనా ఆ కళతో కొత్తదనాన్ని హత్తుకోవాల్సిందే. గ్రాఫిటీ మన యువ సంస్కృతికి నేటి సరికొత్త వర్ణచిత్రం. విశ్వ మానవుని భావ ప్రకటనకు ధ్రువపత్రం. విప్లవ ప్రచారోద్యమాలకు అంకితమైన మంత్రం.

అజయ్ కుమార్ వారాల
9502395077

వేల ఏళ్ల క్రితమే ఆదిమానవుడు కొండ గుహల్లో గోడలకు చేతి ముద్రలేసిందే తొలి గ్రాఫిటీయేమో. దాని గ్రావిటీ ఎంతంటే నేటి యువతరానికి అదే ఒక భావజాలమైపోయింది. అగ్ని పర్వతం పేలుడుకి పరిసమాప్తమైన గ్రీకుల పొంపై వీధి ఎస్ఫెసస్ శిథిలాలు గ్రాఫిటీని కలిగిన తొలి ఆధారాలై మళ్లీ కొత్త అంకాన్ని ఆరంభించాయి. తన సున్నిత హృదయాన్ని ముక్కలు చేసిన వీనస్ దేవత రెక్కలు విరిచేస్తానని గోడపై విరహపు మాటల్ని కూలుస్తూ వేయేళ్ల కిందటి భగ్న ప్రేమికుడు సిల్ తన ప్రేమకు గ్రాఫిటీ ఆసరా తీసుకున్నాడు. 'ఆస్టిన్ వైట్, షికాగో, 1918 అండ్ 1945' అనే పదాల్ని వెర్డాన్ కోటపై ఎరుపెక్కించి మరో ప్రపంచ యుద్ధపు ఊసే వినబడగోడదని ఆ సైనికుడు గోడపై విసుక్కున్నాడు. ఈ విషయాలు చాలవు, గ్రాఫిటీ చరిత్రలో ఎంతటి చర్విత చర్వణమో. మాయన్లు, ఐగుప్తులు, వైకింగులు, రోమన్లు గ్రాఫిటీతో తమ భావాలను గోడకెక్కించినవారే. ప్రియురాలికి రాసే ప్రేమలేఖలకు, నియంతృత్వానికి పలికిన చరమగీతాలకు వీధి గోడలను అద్దెకు తొడగి పబ్లిక్ వెర్షనైందిది. మన ఊళ్లలోను రంగుల్ని కలబోసి దేవతామూర్తుల చిత్రాల్ని రహదారులపై చకచకా చిత్రించే వారున్నారు. ఇలాంటి వీధి కళల్లో బాగా ప్రాచుర్యం పొందిందే ఈ గ్రాఫిటీ. అయితే, 20వ శతాబ్దపు మధ్యన న్యూయార్క్ నగరంలో గ్రాఫిటీ కొత్త వర్ణాన రంగరించింది. హిప్‌హాప్ సంస్కృతిలోని బీబాయింగ్ లాంటి నాలుగు అంశాల్లో ఒకటైన దీనికి ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ వచ్చింది. అంతటా గ్రాఫిటీ గ్యాంగులు పోగై నిద్రిస్తున్న వీధుల మగత



నిద్ర వదలగొట్టాయి. ఆ వీధుల్లో మేల్కొన్న ఈ కళ ప్రపంచాన్ని చుట్టేసి మన దేశానికి ఆవులిస్తూ చేరింది. ఢిల్లీ వీధుల్లో, చండీగఢ్ మలుపుల్లో, పూనె భవంతుల పిట్టగోడలపై, గోవా బీచ్ కరకట్టపై, కోల్‌కతా గోడల మీద, హైదరాబాద్ ఫ్లై ఓవర్ స్తంభాల మీద వాలిపోయిన గ్రాఫిటీ విశాఖపట్నం కుర్రాళ్ల అడ్డాల్లోను వెలిగిపోతోంది. దేశీ వీధులకు హిప్‌హాప్ టాటూలను పొడిచేస్తోంది. గ్రాఫిటీ బాంబింగ్‌తో సామాజిక రుగ్మతలపై చేస్తోన్న పోరాటం కళ్లకు కడుతుంటే, మరో వైపు గ్రాఫిటీ పిస్సింగ్‌ను చెడుగా ఉపయోగించి పరుల ఆస్తులను ఖరాబు చేస్తున్న కేసులు కలవరపెట్టిస్తున్నాయి. నిర్భయ ఘటన నేపథ్యంలో ఢిల్లీ గల్లీల నుంచి తెలుగు నగరాల పబ్లిక్ పాయింట్‌లలో విలపించిన యాంటీ రేప్, యాంటీ అబ్యూజ్ వేడుకోళ్లు గ్రాఫిటీలోని ఉదాత్తతకు అర్థం చెప్పాయి. ఈ మధ్య ముంబై ఎయిర్‌పోర్ట్ టాయ్‌లెట్ రూంలో కలవరపెట్టిన ఐసిస్ రాతలు గ్రాఫిటీకి అంటిన మాలిన్యాన్ని వివరించాయి.

సందేశాల గ్రావిటీ

భిన్న పార్శ్వాలకు వేదికైన ఈ అద్భుత కళ దేశీ యూత్‌కు చక్కని కాలక్షేపం, కార్యక్షేత్రం అవుతోంది. కొందరు దీన్ని కళే కాదని కొట్టిపారేసినా వాటిలోని మార్మికత, విలక్షణీయత వాళ్లు కలలుకంటున్న కళల కంటే ఇది ఘనమైనదనిపిస్తుంది. ఈ ఘనమైన, గాఢమైన గ్రాఫిటీలో చేయితిరిగిన దేశీ కళాకారులు ఎంతో మంది ఉన్నారు. కొందరు ట్యాగింగ్ పేర్లతో వినతికెక్కితే, రంగు గీతలతో ఘనత సాధిస్తున్నవారూ ఉన్నారు. ఇదంతా ఎందుకంటే గ్రాఫిటీ చాలా వివాదాస్పదం. ఆదరించినంత కాలం పేరు మార్మోగిపోతుంది. ఎక్కడైనా చిన్న తేడా వచ్చి గీత తడబడినా జైలు జీవితానికి దారి ఏర్పాటు అవుతుంది. ముంబైకి చెందిన టైలర్, ఢిల్లీకి చెందిన డాకులు ట్యాగింగ్ పేర్లలతోనే సమాజ కట్టుబాట్లని వెక్కిరిస్తూ, పెద్దల అరాచకాల్ని ధిక్కరిస్తూ గ్రాఫిటీతో గోడకెక్కుతారు. వీరి భావాలు మంచి మార్పుకే అయినా, వారి పోరాటం నడిచేది బడాబాబుల చెప్పుచేతల్లో నడుస్తోన్న సామాజిక చట్రంలో. టైలర్ గోడ మీద పడింది, ముంబై యువత శ్వాసైన నైట్ లైఫ్ మీద విరుచుకుపడుతున్న పోలీసు రూల్స్ మీద. రాత్రి పగలూ తేడా లేని బుద్ధిజీవులు, ఉద్యోగ దాస్యం నుంచి కాసేపు రిలాక్స్ అయ్యేది అపుడే. గిరికీలు కొట్టే షిఫ్టు బతుకుల మధ్య విశ్రాంతి దొరికేది ఎక్కువ రాత్రులే కనుక, దాన్ని వృథా చేయలేని యువత, రాత్రుళ్లు వీధుల్లో చక్కర్లు కొడతారు. తోపులాటల్లేని ఆ సమయాన హడావిడి కాస్త నిదానించి వారికి హుషారునిస్తుంది. కానీ, ఇదే నైట్ లైఫ్ వల్ల అసాంఘిక శక్తులు పెచ్చుమీరడంతో పోలీసు వ్యవస్థ నియంత్రించాల్సి వస్తోంది. అయితే, ఒక్కోసారి ఆ జోక్యం కట్టుతప్పి అమాయకులపై కూడా దాడి చేయడంతో టైలర్ గ్రాఫిటీతో స్పందించాల్సి వచ్చింది. ఇక డాకూ అంటే బందిపోటే అయినా దోపిడీ చేసేది మాత్రం మకిలి సమాజ వ్యవహారాల సంపదను. పక్కవాడు చస్తున్నా పట్టని యంత్రులను లక్ష్యం చేస్తూ దేవనాగరి లిపిలో రాసిన రెండు అక్షరాలు ఢిల్లీవాసుల్ని షాక్‌కు గురిచేశాయి. కొందరు తమ అభిప్రాయాన్ని ప్రతిఫలించాడని హర్షిస్తే, మరికొందరు కనుబొమ్మలు ఎగరేశారు. దేశాన్ని ఓ కుదుపు కుదిపిన కొచి 'కిస్ ఆఫ్ లవ్'పై స్పందిస్తూ 'గెస్ హూ' ఆర్టిస్ట్ వేసిన కామిక్ హీరో, హీరోయిన్ల చుంబన గ్రాఫిటీ వివాదాస్పదమై అతడి ఇతర గ్రాఫిటీలపైన ప్రభావం పడింది. అయితే, భారతీయ మహిళ శక్తిని సూచిస్తూ వేసిన గ్రాఫిటీ తెచ్చిన పేరు అతడు తిరిగి నిలదొక్కుకునేలా చేసింది.

శ్రీనగర్ సంస్కృతిని కళ్లకు కడుతున్న గ్రాఫిటీ

గెస్ హూ వేసిన భారతీయ స్త్రీ శక్తి

సంప్రదాయకంగా చీర కట్టి ముసుగు వేసిన ఓ మహిళను వ్యోమగామిగా చూపిన ఆ గ్రాఫిటీ అంతర్జాతీయ విమర్శకుల మన్ననలు గెలుచుకుంది. ఇలా కళా ప్రపంచం నోటిలో నానిన 'గెస్ హూ'ను బీబీసీ రహస్య ఇంటర్వ్యూ కూడా చేసింది. ఆ సందర్భంలో 'గెస్ హూ' చెప్పిన మాటలు ఆలోచనలో పడేశాయి. కిళ్లీ మరకలు, మూత్ర దుర్వాసన, చిందర వందర ఫ్లెక్సీలు, చిరాకు పరిచే బ్యానర్లు, రోత పుట్టించే పోస్టర్లు, అడ్డమైన యాడ్స్‌తో కుళ్లిపోతున్న గోడల దుస్థితిని మార్చి విశాల భావాలను చెప్పే ప్రయత్నంలో గోడల్ని వర్ణశోభితం చేస్తూన్న గ్రాఫిటీని స్వాగతించాలని అంటాడు. సమాజ లోపాల్ని పట్టిచూపుతున్న గ్రాఫిటీపై కక్ష్యకట్టిన వారి ఆలోచనలే అతి ప్రమాదకరమనేది గెస్‌హూ ఆవేదన. ఇక అస్సాంకు చెందిన యంత్ర్ వన్యమృగాల స్మగ్లింగ్, లంచగొండితనానికి వ్యతిరేకంగా వేస్తోన్న గ్రాఫిటీలు అక్కడ చైతన్యం తీసుకువస్తున్నాయి.

కళగానే అంకితం

గాఢమైన సందేశాలు, సూక్ష్మమైన అర్థాలతో బరువెక్కిన గ్రాఫిటీకి భిన్నంగా, అసలేం సందేశం లేకుండా కేవలం ఓ అబ్బురాన్ని చిత్రిస్తూ కళగానే అంకితమిస్తున్న గ్రాఫిటీ కళావాసులున్నారు. వీరిలో ముందుగా చెప్పుకోవాల్సింది రంజిత్ దహియా గురించి. బాలీవుడ్ అజరామర చిత్రాలు, అపురూప సన్నివేశాల్ని బాంద్రా వీధుల్లో కళ్లకు కడుతున్న రంజిత్‌కు సినిమా, గ్రాఫిటీ రెండు కళ్లు. స్థానికులను ఒప్పించి దీవార్‌లోని యాంగ్రీ అమితాబ్ స్టిల్స్ నుంచి అనార్కలి చిత్రంలోని రొమాంటిక్ సన్నివేశాలను గోడలపై అచ్చుగుద్దేశాడు. సున్నాలేసుకునే స్థోమత లేని వారి ఇళ్లకు కొత్త కళ తేవడంతో బాంద్రా చాపెల్ రోడ్ వాసులు తెగ మురిసిపోయారు. ఈ గ్రాఫిటీలతో పర్యాటకులు ఆ ప్రాంతాన్ని సందర్శించడం పరిపాటైంది. ఇక రాక్ అనే ఆర్టిస్ట్ లైన్ వేరు. కొంటెగా ఉండే ఇతగాడి గీతలు చూపరులను ఆకట్టుకుంటాయి. సావన్, వింక్, గంజిత్, పురుస్వాని, పవన్ తదితరులు గ్రాఫిటీ కళాకారులుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వీరి కళాఖండాలకు వేదికలైన గోడలే తర్వాతి తరాన్ని తయారుచేస్తున్నాయి. ఢిల్లీకి చెందిన ఓ పాఠశాల విద్యార్థి ఆ గోడలు నాతో మాట్లాడతాయి అంటూ

చెప్పిన మాట అవెంతగా అతణ్ని ప్రభావితం చేశాయో వివరిస్తోంది. ఆ తర్వాత అతడు జయిన్ అనే పేరిట గ్రాఫిటీ కళాకారుడిగా మారాడు. అంతర్జాతీయంగా నిర్వహించే పోటీలు, కార్యక్రమాల్లో పాల్గొని మన ఆర్టిస్టులు ప్రత్యేక దేశీ స్టైల్‌కు ప్రచారం తీసుకువస్తున్నారు. ఈ కళాకారుల భావాలకు హద్దులు లేనట్టే వీరి వీధి క్యాన్వాసులకు కూడా ఎల్లలు లేవు. దేశంలోని ప్రధాన నగరాలంతటా వీరి కళ విరబూస్తోంది. ముఖ్యంగా ఆగ్రా, చండీగఢ్, జైపూర్, డెహ్రాడూన్, గోవా, బెంగళూర్, కోల్‌కతా, లేహ్, మార్మగోవా, పనాజీ, న్యూఢిల్లీ, ముంబై, పూణె, ఉదయ్‌పూర్, కోచి, చెన్నై, తిరువనంతపురం వంటి చోట్ల గ్రాఫిటీని భారీగా చూడొచ్చు. కొందరు కళాకారులు ఈ ప్రాంతాల్లో పర్యటిస్తూ వీటిని గీస్తున్నారు.

బ్లాక్‌బస్టర్ వీధులు

వసంత కాలంలో ప్రకృతిలా గ్రాఫిటీ వర్ణం, వర్ణనల్లో వీధులు పులకించడంతో గ్రాఫిటీ క్యాంపెయినింగ్‌లకు బీజం పడింది. ఢిల్లీలో నిస్తేజంగా పడిఉన్న వీధులకు శోభనిచ్చేందుకు హనీఫ్ ఖురేషి అనే గ్రాఫిటీ పిపాసి స్ప్రేయర్‌ను గిలకొట్టాడు. ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న గ్రాఫిటీ రాక్‌స్టార్లను కూడగట్టి ఢిల్లీ వీధుల ముఖ చిత్రాన్ని మార్చేశాడు. అంతర్జాతీయ సంచలనం తైవానీస్ గ్రాఫిటీ లెజెండ్ యానో కూడా మార్కర్‌ను మంత్రించి తన మార్క్ వేశాడు. అస్తవ్యస్తంగా ఉన్న గోడల బ్యూటిఫికేషన్‌కు పోలీస్, నగర పాలక సంస్థ నుంచి మద్దతు లభించడంతో కళ విజృంభించింది. ఆర్టిస్టుల రంగుల కలబోతలో కళాపాతానికి గురైన అధికారులు ఏకంగా పోలీసు ప్రధాన కార్యాలయ భవంతికే గ్రాఫిటీని వేయించుకున్నారు. మొత్తం 60 ఆర్టిస్టులకు పైబడి పనిచేసిన ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత గోతే ఆర్ట్ ఇనిస్టిట్యూట్, ఇటాలియన్, పోలిష్ సాంస్కృతిక కేంద్రాలు సహాయాన్ని అందించాయి. స్థానికులు అపూర్వమైన మద్దతునిచ్చారు. తీహార్ జైలు గోడలు, షాపూర్ జాట్ రెసిడెన్సీ భవనాలు, లజ్‌పత్‌నగర్, మాలవ్యా నగర్ వీధులు వేదికయ్యాయి. ముంబైలోని తులసీ పైప్ రోడ్ కూడా గ్రాఫిటీ రంగుల్లో తడిసిముద్దైంది. ఏకంగా నాలుగు వందల మంది కళాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పొడగాటి గ్రాఫిటీలతో పాటు, కళ్లు చెదిరే చిన్న చిన్న కళా ఖండాలున్నాయి. ఈ కార్యక్రమానికి చాలా రోజుల నుంచే సన్నద్ధమై చాలా అర్థవంతమైన గ్రాఫిటీ గొలుసుకట్టును సృజించారు. కేవలం కళా ప్రేమికులకే కాక స్థానికులకు ఇవి అపూర్వంగా అనిపించాయి. వాటిని ధ్వంసం చేయకుండా, వాటి అందాన్ని చెడగొట్టకుండా ఓ కన్నేసి ఉంచుతున్నారు. ఓ సారి ఎవరో మూత్ర విసర్జన చేయబోతుంటే అటువైపుగా వెళుతున్న స్థానికుడు ఒకరు వాహనం ఆపి అతణ్ని తరిమాడు. మరికొందరి సహకారంతో అతణ్ని పట్టుకుని బుద్ధి చెప్పాడు. కట్టిపడేసే ఈ కళకు వస్తున్న స్పందన గమనించిన మాల్స్, అపార్ట్‌మెంట్‌లు, ఆటో యూనియన్‌లు, స్కూళ్లు కోరి మరీ గ్రాఫిటీని వేయించుకుం టున్నాయి. పార్కింగ్ స్థలాల నుంచి, ఆటమైదానాల వరకు ఎక్కడ ఖాళీ దొరికినా గ్రాఫిటీ రోలర్ తాండవం చేయాలని కోరుకుంటున్నారు.

ఢిల్లీ వీధుల్లో గ్రాఫిటీ ఆర్టిస్ట్ యానో సందడి

పొల్యూషనూ ఉంది

గ్రాఫిటీతో కొన్ని సమస్యలు, సవాళ్లున్నాయి.

ఏ మాత్రం అవకాశం చిక్కినా ప్రతి కళను విధ్వంసానికి వాడుకునే వారికి కరువు లేదు. ఎక్కువగా టీనేజ్ పిల్లల్ని ఆకర్షించే ఈ కళ తుంటరి కుర్రాళ్ల చేతుల్లో పడి వీధుల్లో రంగు బురద జల్లుతోంది. నియంత్రణ తప్పి ఒక్కోసారి పెడర్థాలకు తావిస్తోంది. వయసు రీత్యా తీవ్ర భావోద్వేగాలు, ఆలోచనలు ఉండటం, వాటిని గ్రాఫిటీల్లోకి తర్జుమా చేయడంతో చిక్కుల్లో పడుతున్నారు. పబ్లిక్ పాయింట్లు ఎక్కువగా లక్ష్యమవడంతో ఏది రాసినా, గీసినా

కాశ్మీర్ ఆదర్శం

గ్రాఫిటీని దేశంలో కారుచిచ్చు పెట్టేందుకు ఉపయోగిస్తున్న అసాంఘిక శక్తులకు దానితోనే బుద్ధి చెప్పారు శ్రీనగర్ అధికారులు, ప్రజలు. తాలిబన్లకు ఆహ్వానమంటూ వేసిన దేశ వ్యతిరేక గ్రాఫిటీలు స్థానికులకు కునుకు పట్టనివ్వలేదు. దీన్నుంచి బయటపడేసేలా శ్రీనగర్ అధికారులు పేరుపొందిన గ్రాఫిటీ కళాకారులను పిలిపించి శ్రీనగర్ ఔన్నత్యాన్ని తెలిపే గ్రాఫిటీలను పాతవాటి స్థానే వేయించారు. శ్రీనగర్‌వాసుల జీవన విధానాన్ని, సంస్కృతిని ప్రతిబింబిస్తూ వేసిన ఈ చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. స్థానికుల మద్దతునివ్వడంతో పాటు వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కలర్‌ఫుల్ సెన్సార్‌షిప్‌గా అభివర్ణించిన ఈ కార్యక్రమం విద్రోహ శక్తులకు మంచి సమాధానాన్ని ఇచ్చింది. దేశంలో మిగతా చోట్ల ఇలా అసాంఘిక గ్రాఫిటీ ఘటనలు ఎదురైతే కొందరు కళాకారులు ఈ విధంగా వాటిని చెరిపేసి, గ్రాఫిటీ అనేది నేరం కాకుండా జాగ్రత్త పడుతున్నారంటే శ్రీనగర్ కలర్‌ఫుల్ సెన్సార్‌షిప్ ఎంత ఆదర్శదాయకమైందో తెలుస్తోంది.

రంగుల్తో రాసేది

గ్రాఫిటీ అంటే రంగురంగుల చిత్రాలను, సందేశాలను అందంగా వీధిగోడలపై పెయింటింగ్‌లా వేయడమే. ఇదో వీధి కళగా ప్రాచుర్యం పొందింది. వీటిని వేసేందుకు ఎక్కువగా ఏరోసోల్ స్ప్రేయర్లను వాడతారు. కొందరు పెద్ద పెద్ద కుంచెల్నీ ఉపయోగిస్తారు. కేవలం ఓ చిత్రాన్ని గోడపై దించేస్తే, వెల్ల వేయడానికి దీనికి పెద్దగా తేడా ఏముంటుంది. గ్రాఫిటీలో ఓ రకమైన సందేశముంటుంది, రహస్య సంకేతముంటుంది. అది పబ్లిక్ కోసం. సామాన్యుని పక్షం. భావ ప్రకటనకు ఆయుధం. గ్రాఫిటీలోను ప్రత్యేకమైనవి ఉన్నాయి. బాంబింగ్, పిస్సింగ్, త్రో అప్, బ్లాక్‌బస్టర్, స్టిక్కర్, స్టెన్సిల్ శైలుల్లో వాటిని వేస్తారు. వైల్డ్ స్టైల్‌లో అక్షరాలను ఒకదానికి ఒకటి కలిపి పదాల గొలుసుల్ని వివిధ భంగిమల్లో వేస్తారు. వాటిని ఓ పట్టాన చదవడం కుదరదు. అతి కొద్దిమందే వాటిని అర్థం చేసుకోగలరు. గ్రీకు భాషలోని గ్రాఫిన్ అనే పదం నుంచి ఇది పుట్టిందంటారు. గ్రాఫిన్ అంటే రాసేందుకు అని అర్థం.

హైదరాబాద్‌లోని గ్రాఫిటీ

చాలా త్వరగా ప్రచారమైపోతున్నాయి. ఈ విజువల్ పొల్యూషన్ వల్ల తప్పుడు సిద్ధాంతాలు యువత మనస్సుల్లో బలంగా నాటుకుపోతున్నాయి. కొందరు తెలివిగా యాడ్స్‌కు వాడుకోవడంతో వీటి అసలు లక్ష్యం గతి తప్పుతోంది. గృహ యజమానుల అంగీకారం లేకుండా చెలరేగిపోతుండటంతో కేసులు నమోదవుతున్నాయి. పశ్చిమ బెంగాల్ సర్కార్ తొలుత ఓ యాక్ట్‌ను తీసుకురావాల్సిన పరిస్థితి వరకు వ్యవహారం పోయింది. ఇప్పటికే ఉన్న యాంటీ వ్యాండలిజం, డిఫేస్‌మెంట్ యాక్టుల పరిధిలోకి వచ్చే ఈ చర్యలు ఊచలు లెక్కబెట్టిస్తాయి. చెన్నై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తిరునల్వేలిలో హద్దు మీరిన కొందరు ఆర్టిస్టుల్ని అరెస్టు చేసింది. చాలా అపూర్వమైన కట్టడాల్ని గ్రాఫిటీతో పాడుచేస్తున్నవారికి వ్యతిరేకంగా నిరసనలు పెల్లుబికాయి. దీని గౌరవం చెడకుండా, వక్రమార్గాలు పట్టకుండా ఉన్నంత కాలం గ్రాఫిటీకి దేశం ముచ్చటపడుతుంది. లేకుంటే చాలా దేశాల్లోలా గీత కనబడ్డా, రాత కనబడ్డా నిప్పులు చెరిగే చట్టాలు తయారయిపోతాయి. అయితే, ఇంతవరకు పరిస్థితి రాదనేది కళాకారుల విశ్వాసం. ఎంతైనా భారత్‌లో గ్రాఫిటీని చూసే పద్ధతి వేరనేది వారి వాదన. గ్రాఫిటీని వేస్తామంటే చాలామంది యజమానులు ఇట్టే అంగీకారం తెలుపుతున్నారని, అయితే వారి భవంతులకు మరింత అందాన్ని తెచ్చేదిగా ఉండాలని వారు ఆశిస్తారని చెబుతున్నారు. యజమానులకు ఐడియాపై ఓ మాట చెప్పి పని మొదలెడితే ఎందుకైనా మంచిదనేది బడ్డింగ్ ఆర్టిస్టులకు కొందరు సీనియర్ల సలహా. గ్రాఫిటీతో మరో చెడేంటంటే. ఏరోసోల్ స్ప్రేయర్లను వాడటం వల్ల పర్యావరణం కలుషితమౌతోంది. మిథనాల్ ఇతర విషపూరిత రసాయనాలు ఉండటం వల్ల వాటిని వాడే వారితో పాటు పర్యావరణం దెబ్బతింటోంది. స్ప్రే చేయడంతో గాలిలో రంగులు కలిసిపోవడంతో దీనికి పరిష్కారంగా స్టిక్కర్లు, స్టెన్సిల్ వంటి కొత్తరకం గ్రాఫిటీని వాడుతున్నారు. వీటి వల్ల మరో ప్రయోజనమేమిటంటే త్వరగా చిత్రాన్ని పూర్తిచేసే అవకాశం ఉండటం. సహజ రంగుల్ని, పదార్థాలను వాడుతున్నవారూ ఉన్నారు. మోస్ గ్రాఫిటీ అనే ఈ తరహా కళకు ఇప్పుడిప్పుడే ప్రచారం లభిస్తోంది.

కొచ్చిలోని మోస్ గ్రాఫిటీ

'రంగ్ దే బసంతి'లో 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదం క్యాంపస్ గోడలకెక్కినప్పుడు, 'ఆరెంజ్'లో ప్రియురాలి వదనాన్ని గీస్తూ తన ప్రేమ వేదనను హీరో చెప్పినపుడు గ్రాఫిటీ మాయాజాలం బాగా తెరపరిచయమైంది. 'జల్సా'లోని స్ఫూర్తి గీతంలో తళుక్కుమనే చేగువేరా గ్రాఫిటీతో సుపరిచితమైంది. మిగతా కళా మాధ్యమాల్లోను దాని ప్రభావాన్ని పట్టిస్తోంది. ఫ్యాషన్‌వేర్‌లోకి వేళ్లూనుకున్న గ్రాఫిటీ ల్యాప్‌టాప్ కవర్ల నుంచి ఫేస్‌బుక్ వాల్‌పేపర్ల వరకు ప్రతిచోట హల్‌చల్ చేస్తోంది. గ్రాఫిటీ ఆర్ట్‌పై సిమ్యులేషన్ వీడియోగేమ్స్ వచ్చేశాయి. ఓ కళగా ఆరాధిస్తూ సినిమాలు, షార్ట్‌ఫిల్మ్‌లు తీసేశారు. ప్రపంచాన్ని చుట్టి గ్రాఫిటీని వేల ఫొటోల్లో బంధించి భద్రపరిచిన ప్రేమికులు ఉన్నారు. కోట్ల విలువైన చిత్తరువులకు తీసిపోని విధంగా లోతైన, తీవ్రమైన, తీక్షణమైన, గాఢమైన, బరువైన ఈ కళాఖండాలు క్లిక్ అయితే వాటి ప్రచారం ఖండాల్ని దాటేస్తోంది. ఏసీ గదుల్లో సేదతీరుతూ నాజూగ్గా కొలువుదీరిన చిత్తరవులు కొందరికే పరిమితమైతే, వీధులకెక్కి విన్యాసాలు చేస్తున్న ఈ గ్రాఫిటీ కామన్‌మేన్ విలాసం అవుతూ అందరివాడవుతోంది. ఎండకి, వానకి తడుస్తూ కరుకైన ఈ గ్రాఫిటీ శ్రమజీవులకు ఆహ్లాదాన్ని, వినోదాన్ని పంచుతోంది. వారి తరఫున వకాల్తా పుచ్చుకుని మౌన విప్లవాన్ని రచిస్తోంది.వారి మనోభావాల్ని ప్రతిఫలిస్తోంది. గ్రాఫిటీ... సమాజంపై కళాకారుల ప్రభావాన్ని చేతల్లో చూపించిన రాత, గీత. సమాజమనే విశాలమైన గోడకు పట్టిన మకిలిని వదిలించే అర్థవంతమైన, అందమైన మరక. క్షమించాలి... మరక కాదది, సమాజాన్ని దేదీప్యం చేసే మరకతం.

✦

ఇన్‌ఫినిటీ...

న్యూయార్క్ నగర వీధుల నుంచి మరలి సబ్‌వేలలో చొరబడిన గ్రాఫిటీ అక్కడ పెద్ద సంచలనమైంది. ముక్కు మీద గుద్దినట్టు అమెరికా పెత్తందారీ పోకడలను ప్రశ్నించిన గ్రాఫిటీలపై ప్రభుత్వం విరుచుకు పడింది. ప్రైవేట్ ఆస్తులపై కూడా గ్రాఫిటీ జెండాలను ఎగరేయడంతో ప్రత్యేక చట్టాలను తెచ్చి గ్రాఫిటీ జాడల్ని చెరిపేయడం మొదలెట్టింది. రహస్య జట్లను ఉపయోగించి కట్టడి చేయాల్సి వచ్చిందంటే ఎంత తీవ్రంగా గ్రాఫిటీ కలకలం సృష్టించిందో!. ఎంత పకడ్బందీ ఏర్పాట్లు చేసినా గ్రాఫిటీలు రైళ్లెక్కేశాయి. సందేశాల కూత పెడుతూ నగరమంతా చుట్టేశాయి. చైనా ఐక్యతకు మావో జెడాంగ్ గ్రాఫిటీల సహాయాన్ని తీసుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బ్యాంక్సీ అనే ట్యాగింగ్ పేరు గల కళాకారుడు ప్రపంచ గ్రాఫిటీ అభిమానులచే రాక్‌స్టార్‌గా కీర్తించబడుతున్న వ్యక్తి. ఆ దేశంలోనే కఠిన చట్టాలున్నా, అతడిపై

కేసులున్నా ప్రపంచ వ్యాప్తం గా అతడి వివాదాస్పద రాతలు, గీతలు సాగిపోతున్నాయి. స్థానిక ప్రభుత్వం ప్రత్యేకంగా అతడి గ్రాఫిటీకి రక్షణ నిస్తోంది. ఆస్ట్రేలియా, సింగపూర్ తది తర దేశాల్లో గ్రాఫి టీ నియంత్రణ చట్టాలున్నా చాలా దేశాలు గ్రాఫిటీని ఓ కళగా గుర్తిస్తూ దాని వికాసానికి అవకాశం కల్పిస్తున్నాయి. స్కాట్లాండ్‌లోని డీపీఎం పార్కు, బ్రిస్టల్‌లో గ్రాఫిటీ వేసేందుకు జాగాను వదిలారు. బెర్లిన్ గోడలపై వేసిన శాంతి, సమైక్యత గ్రాఫిటీలను పుణ్యతీర్థాలుగా సందర్శిస్తున్నారు. బెల్‌ఫాస్ట్‌లోని కళాఖండాల రక్షణకు ఉద్యమమే నడిచింది. ప్రపంచంలోనే అది పెద్దదైన గ్రాఫిటీ కలిగిన సేబర్ ఎమ్మెస్కే లాస్ ఏంజెల్స్ నది ఒడ్డున కనువిందు చేస్తోంది. మలేషియా ప్రభుత్వం 2010 నుంచి ప్రతి ఏటా గ్రాఫిటీ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. క్యూబాలో చేగువేరా గ్రాఫిటీ లేని వీధులు కనిపించవు. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్ సిటీలో ఉన్న ఫైవ్ పాయింట్జ్ గ్రాఫిటీ కళాఖండాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిఫేన్స్ ఆర్టిస్ట్ జట్టు ప్రచారోద్యమం చేస్తోంది. గ్రాఫిటీ రంగుల చిలకరింపు అద్భుతాలను చూడాలనుకునే పర్యాటకులు బ్యూనస్ ఎయిర్స్, లాస్ ఏంజెల్స్, మెల్‌బోర్న్, సావోపాలో, లండన్, సాంటియాగో, బెర్లిన్, బొగోటా, కేప్‌టౌన్‌లను ప్రత్యేకంగా సందర్శించి వస్తారు.

◆ కథ

మాయ

"కలెక్టర్ గారూ! ఏం జేస్తున్నారు. మీ అధికారులంతా ఎక్కడ పడుకున్నారు. నెల రోజుల నుండి సిరిపురం గ్రామంలో ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు, బంద్‌లు చేస్తుంటే ... మీరు, మీ యంత్రాంగం ఏంజేస్తున్నట్లు? ఏరికోరి మీరు నా మనిషని మిమ్ములను అక్కడికి పంపితే ఇదా మీ నిర్వాకం? అవతల సి.యం. రాజా ఫార్మాసీ కంపెనీ శంకుస్థాపనకు తొందర పెడుతున్నారు. మీరేంజేస్తరో తెల్వదు! వారంలో అంతా సద్దుమణిగి పనులు మొదలు కావాలి...." మంత్రి గుర్నాథరెడ్డి ఫోన్‌తో కలెక్టర్ సురేంద్రకుమార్‌కు ముచ్చెమటలు పట్టాయి. "అలాగే సార్ ...అలాగే సార్... " అని ఫోన్ పెట్టేశాడు.

ఇక చూడు కలెక్టర్, యస్.పి., జేసి., ఆర్.డి.వో.తో పాటు అధికారులంతా సిరిపురం వైపు పరుకులు పరుగులు.

అసలు కథేంటంటే సిరిపురం గ్రామం పక్కనే రెండు గుట్టల మధ్య రెండొందల ఎకరాల ప్రభుత్వ భూమిఉంది. ఎప్పుడూ గల గలాపారే అమృతం వాగు. ఆపైన ఎప్పుడూ నీరుండే పెద్ద చెరువు. సదరు ప్రభుత్వ భూమి మీద ఓ బడా మందుల ఫ్యాక్టరీ యజమాని కన్ను పడింది. భూమి ఉంది, నీరు ఉంది, కారు చౌకగా దొరికే కూలీలున్నారు. ఇంకేం కావాలి. చక్రం తిప్పాడు.

ఎప్పుడైతే గతంలో ఎసైన్‌మెంటు భూములిచ్చిన సన్న చిన్న కారు రైతులకు ఫ్యాక్టరీకి భూమి అవసర ముందని కలెక్టరు నోటీసులు పంపాడో గ్రామంలో అలజడి మొదలైంది. సంజీవరావు అతనే రిటైర్డ్ టీచర్ నాయకత్వంలో ఆందోళన మొదలైంది. ఆయనకు తోడుగా మహిళా నాయకురాలు ముత్తమ్మ, రైతు నాయకుడు యలమంద, విద్యార్థి నాయకుడు మధుసూదన్ జతకలిశారు.

రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు అంతా ఒక్క తాటి మీద నడిచారు. చుట్టూ వున్న నాలుగు గ్రామాల ప్రజలు వీళ్ళకు మద్దతుగా నిలిచారు. సభలు సమావేశాలు ఏర్పాటు చేశారు. అన్ని పార్టీలు ఒక్కటయ్యాయి. ఎక్కడైతే ఫ్యాక్టరీకి భూమి ఇస్తున్నారో అక్కడే టెంటు వేసి ఆందోళన మొదలుపెట్టారు. ఫ్యాక్టరీ వద్దని ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు, ర్యాలీలు, ధూంధాం, ఆటాపాటా, రిలే నిరాహారదీక్షలతో ఉద్యమం ఊపందుకుంది. సంజీవరావు పిలుపిస్తే చాలు కదం తొక్కవలసిందే.

సంజీవరావు మాస్టారంటే ఆ ఊరుకు వల్లమాలిన ప్రేమ. ఎంతో మంది పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ముందుకు నడిపించారు. సిరిపురం ఊరి బాగోగులు మొత్తం ఆయన చేతిమీద నడవాల్సిందే. ఎలాంటి తగాదాలైనా ఇరువర్గాలకు నచ్చచెప్పి పరిష్కారం చేసి పంపేవాడు. ఇంతవరకు ఆ ఊరు నుండి పోలీస్‌స్టేషన్‌లో ఒక్క కేసు నమోదు కాలేదంటే ఆయన చలవే! సాఫ్ట్‌వేరు ఉద్యోగం చేస్తున్న కొడుకు సతీష్ హైదరాబాదు రమ్మని ఎన్నిసార్లు పిలిచినా ఉన్న వూరిమీద ప్రేమతో ససేమిరా రానన్నాడు.

రోజూ పోలీసులు వస్తూనే వున్నారు. నానా హంగామా చేసి పోతున్నారు. లాఠీ చార్జీలు, అరెస్టులు నిత్యకృత్యమయ్యాయి. మంత్రి గుర్నాథరెడ్డి హెచ్చరి కతో జిల్లా యంత్రాంగమంతా కలిసి హడావిడిగా సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేయించింది. ఆందోళనకారుల టెంటుకు ఎదురుగానే గ్రామసభ వేదిక సిద్ధమయింది.

జిల్లా కలెక్టరు సురేంద్రకుమార్, జే.సి.విజ యరాణి, ఆర్.డి.వో. మునిసుందరం, తహశీల్దార్ సుందర్‌రావు ముందురాగా ఫ్యాక్టరీ యజమాని సుబ్బరాజు, మేనేజరు సురేంద్ర తళతళ మెరిసేకార్లలో సూటుబూట్లతో దిగారు. డి.యస్.పి. నిరంజన్‌దాసు, ఓ వందమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాడు.

వీళ్లంతా వచ్చేసరికి ఆటాపాటా ఊపందుకుంది. "ఈ వూరు మనదిరో, ఈ భూమి మనదిరో ఏరు మనది, నీరు మనది, గుట్ట మనది, చెట్టు మనది, పంట మనది, పండించే భూమాత మనదిరో, ఫ్యాక్టరీ ఏందిరో, వాని పీకుడేందిరో, పోలీసులేందిరో వాళ్ల జులుం ఏందిరో" నారాయణమూర్తి సినిమా స్టైల్ పాటతో సమావేశ స్థలం దద్దరిల్లింది. మాయదారి మందుల కంపెనీ మాకొద్దు, నినాదాలు జోరందుకున్నాయి. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. డప్పులు, కంజర్లు, గజ్జెలు ఎవరి దగ్గరున్నవి వారు మోగించారు. వేదిక మీద అధికారులు, వేదిక కింద ఉద్యమకారులు, గ్రామ ప్రజలు. కలెక్టరు లేచి నిల్చుని మైకందుకున్నారు. జనం నినాదాలు చేస్తూనే వున్నారు. సంజీవరావు లేచి తన చేయి ఊపాడు. క్షణంలో అంతా సైలెంటయి పోయింది. కలెక్టరు ఒకింత ఆశ్చర్యపోయాడు.

"సిరిపురం గ్రామ పెద్దలు, ఇక్కడికి వచ్చిన ప్రజలందరూ దయచేసి గ్రామసభకు సహకరి ంచండి. ఇక్కడ ఫ్యాక్టరీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాయి. అన్ని రకాల అనుమతు లొచ్చాయి. మీ ప్రాంతం వెనుకబడిందని ఇక్కడ ఫ్యాక్టరీ పెడితే, మీ పిల్లలకు ఉద్యోగాలు దొరుకుతాయి. విద్యుత్తు, నీరు, రోడ్లు బాగుపడుతాయి. దయచేసి మీ అభిప్రాయాలు చెప్పండి. మా జె.సి.గారు, కంపెనీ యం.డి.

సుబ్బరాజుగారు మీకు సమాధానాలు చెప్తారు. సంజీవరావుగారు మీరు మాట్లాడండి." కలెక్టరు మాట్లాడుతున్నంత సేపు "వద్దు, వద్దు" అనే నినాదాలు చేస్తూనే వున్నారు. కలెక్టరు కూర్చోగానే సంజీవరావు లేచాడు.

"కలెక్టరుగారూ, వేదిక మీదున్న పెద్దలందరికి నమస్కారం. అయ్యా! ఫ్యాక్టరీ వద్దని గత నెల రోజులుగా మేం ఆందోళన చేస్తూనే వున్నాం. ఎన్నో అర్జీలు పెట్టుకున్నాం. ఎంతో మంది పర్యావరణ శాస్త్రవేత్తలు వచ్చారు. ఏ ఫ్యాక్టరీ అయినా పర్యావరణం పాడు చేస్తుందని ముఖ్యంగా నీరు కలుషితమైపోతుందని చెప్పారు.

గత నెలరోజుల నుండి మా పేదరైతులు తిండి, నిద్రలేక నానా యిబ్బందులు పడుతున్నారు. తమ భూములు పోతే తామేం చేసి బతకాలని వీళ్ల భయం. అదీగాక ఇప్పుడు మీరు భూములు తీసుకుంటున్న రైతులంతా ఎకరం రెండెకరాల సన్న చిన్నకారు రైతులే. అదీగాక మీరు నిర్మించబోయే ఫ్యాక్టరీ వూరికి దగ్గరలో వుంది దయచేసి ఈ ఫ్యాక్టరీని వేరే చోటికి తరలించండి. ఇది మా గ్రామ ప్రజల అభ్యర్థన" ముఖం మీద పట్టిన చెమటను పైనున్న తువ్వాలుతో తుడ్చుకుని కూర్చున్నాడు సంజీవరావు.

"చూడండీ సంజీవరావుగారు ఇక్కడ ప్రభుత్వ భూమి వందెకరాలు వుంది. మరో వందెకరాలు మేము పేదరైతులకు తలా ఎకరం రెండెకరాలు ఎసైన్డ్ పట్టాలు ఇచ్చాం. పట్టాలు ఇచ్చిన్నాడే ప్రభుత్వానికి ఎప్పుడు అవసరముంటే అప్పుడు తీసుకుంటాం అనే కండీషన్ మీదే యిచ్చాం. ఇకపోతే ఫ్యాక్టరీ ఆపడం మా చేతుల్లో లేదు. భూ సేకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాయి. నష్ట పరిహారం ఎక్కువ ఇప్పించే ప్రయత్నం చేద్దాం. ఉపాధి కల్పిద్దాం. వారి పిల్లలకు ఉద్యోగాలిప్పిద్దాం. కాదు మాకు భూమే కావాలంటే ఇంకోచోట కొనిద్దాం." జె.సి. విజయరాణి వివరించారు.

"అయ్యా! కలెక్టరు గారూ! మీరిచ్చిన పోరంబోకు భూములు వీళ్లంతా రాత్రనక, పగలనక కష్టపడి బావులు తవ్వీ, బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నారు. కూలి బతుకు పోయి రైతుగా బతుకుతున్నామని సంతోషంగా వున్నారు. మీరు కంపెనీ పేరుతో మా పొట్టగొట్టకండీ"

"ఇగో ఈ చంద్రమ్మని చూడండి సార్! దీని మొగుడు సారా తాగితాగి సచ్చిండు. వున్న ఒక్క బిడ్డను పెంచి పెద్దచేసి ఈ రెండెకరాల భూమిచ్చి పెండ్లి చేసింది. మీ నోటీసు చూసి ఆ అల్లుడు నీ భూమి పోయినంక నీ బిడ్డ నాకెందుకని తన్ని తగిలేసిండు." మహిళా నాయకురాలు ముత్తమ్మ తన ఆవేదన వెలిబుచ్చింది. పక్కనే నిల్చున్న చంద్రమ్మ వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఓదార్చింది ముత్తమ్మ.

"సార్! పచ్చటి పంట పొలాల మధ్య ఈ ఫ్యాక్టరీ చిచ్చేంది సార్. ఎకరం, రెండెకరాలున్న మాల, మాదిగోల్ల, సుద్దరోల్ల భూములేగావాల్నా సార్. పెద్ద భూస్వాములజోలికెల్లరు. అష్టకష్టాలుపడి పెండ్లాల మీద పుస్తెలు అమ్మి ఈ పొలాల్ని బాగుచేసుకున్నాం. మా బతుకులు మేం బతుకుతున్నాం. మా భూములివ్వమంటే ఇవ్వంగాక ఇవ్వం." రైతు నాయకుడు యలమంద కరాఖండిగా చెప్పాడు. జారిపోతున్న తన నడికట్టు బిగదీసుకుని కూర్చున్నాడు. వెనుక నుండి చప్పట్లు మోగాయి.

"చూడండీ మీరంతా ఆవేశంలో వున్నారు. అపోహ పడుతున్నారు. ఇప్పుడు కంపెనీ యం.డి. సుబ్బరాజుగారు తమ ఫ్యాక్టరీ గురించి చెబుతాడు వినండి." కలెక్టరు మాటలతో జనం సుబ్బరాజు వైపు చూశారు.

సుబ్బరాజు చేయెత్తు మనిషి, పసిడి ఛాయ, రెండు చేతుల వేళ్లకు బంగారు వుంగరాలు, మెడలో గొలుసు, బంగారం ఫ్రేము కళ్లజోడు. ఎటువంటి వారినైనా తన మాటలతో బుట్టలో వేసుకోగల మాయల మరాఠీ. జనం వైపు చూసి రెండు చేతులెత్తి నమస్కరించాడు చిరునవ్వుతో.

"చూడండీ మీరంతా ఏదో ఊహించుకుని భయపడుతున్నారు. మా ఫ్యాక్టరీ మనుషుల ప్రాణాలు కాపాడే మందుల కంపెనీ, ఇది పురుగు మందుల కంపెనీ కాదు. పంటలకు ఏ మాత్రం హాని జరగదు."

"మేం పర్యావరణ పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు కేంద్రం మాకు క్లీన్‌చిట్ యిచ్చింది. మాకు ఫ్యాక్టరీ కొత్త కాదు. ఇంతకు ముందే మాకు హర్యానా, బీహార్, హిమాచల్ ప్రదేశ్‌లలో కంపెనీలున్నాయి. ఎక్కడా ఏ విధమైన హానీ జరగలేదు. కావలిస్తే పోయి చూసిరండి." తేలికగా అనేశాడు. వీళ్లెవరూ అక్కడికి పోయి చూడరని ఈయన ధీమా.

"మీ గ్రామం చాలా వెనుకబడి వుంది. నీళ్ళు లేవు. రోడ్లు లేవు. కరెంటు లేదు. వీధిలైట్లు లేవు. ఒక్క నెల రోజుల్లో అన్నీ సమకూరుస్తా. మీ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తా. బడి, గుడి కట్టిస్తా. కొద్ది రోజుల్లోనే మీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా మారుస్తా! నా మాటలు నమ్మండి! "చిరునవ్వులు చిందిస్తూ ముందున్న మంచినీళ్ళ సీసా ఖాళీ చేశాడు.

సర్పంచ్‌ను మాట్లాడమన్నట్లు కలెక్టరు సర్పంచ్ వైపు చూశాడు. సుబ్బరాజు పక్కనే కూర్చున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి లేచాడు. "సుబ్బరాజుగారు చెప్పింది అక్షరాల నిజం. ఇంతకాలం మన వూరు వెనుకబడి వుంది. అందుకే మన మంత్రిగారు మన వూరు బాగు కొరకు ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టిస్తున్నాడు. అందుకే మన గ్రామ పంచాయితీ ఫ్యాక్టరీకి అనుమతిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది సార్."

"ఎంతెంత మేశారు?" వెనుక నుండి అరుపులు కేకలు.

"మాయదారి కంపెనీ మాకొద్దు, సుబ్బరాజు గోబ్యాక్, సర్పంచ్ డౌన్ డౌన్ నినాదాలు మిన్నుముట్టాయి." అంతా గోలగోలగా వుంది. జనమంతా లేచి నిల్చున్నారు. ఎవరేం మాట్లాడుతున్నారో వినబడడం లేదు. అంతా గందరగోళం.

స్టేజీ మీదున్న అధికారుల్లో అసహనం మొదలైంది. డి.యస్.పి. నిరంజన్ దాసు పొట్టమీద నుండి జారి పోతున్న బెల్టు సరిచేసుకుని మీసం మీద చేయి వేసి నెత్తిమీద టోపీ అటూఇటూ తిప్పి చేతికర్రతో టేబుల్ మీద టకటకలాడించాడు. అతని కండ్లు ఎర్ర బారాయి. కలెక్టరు ముందు జరుగుతున్న గొడవకు కోపం నషాలానికెక్కింది. "చూడండీ చట్టాన్ని మీచేతుల్లోకి తీసుకుని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వూరుకునేది లేదు. మీరు చెప్పేది మీరు చెప్పారు. మేము చెప్పేది వినాలిగాని ఈ గొడవేంటి. వయొలెన్సు ఏ విధంగా కంట్రోల్ చెయ్యాలో మాకు బాగా తెల్సు. నెల రోజులుగా ఓపిక పట్టాం. మీరు కమ్యునిస్టుల్లా, విప్లవకారుల్లా మాట్లాడకండి. వూరుకునేది లేదు...." కోపంతో వూగిపోతూ కూర్చున్నాడు డి.యస్.పి. నిరంజన్ దాసు.

జనంలో అక్కడక్కడ ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు, ఎర్ర రుమాళ్లు, ఎర్ర బ్యానర్లు కనిపించాయి. అదీ ఆయనకు మంట. ఇంట్లో భార్య ఎర్ర చీర కట్టుకున్నా

అర్ధరాత్రి గాఢ నిద్రలో గ్రామం. అమావాస్య చీకటి రాత్రి. పోలీస్ సైరన్ మోతలు, డి.యస్.పి. నిరంజన్ దాసు పోలీసు బలగంతో గ్రామ దిగ్బంధం చేశాడు. దీక్షా శిబిరం కూల్చివేశాడు. గాఢ నిద్రలో ఉన్న సంజీవరావు, ముత్తమ్మ, యలమంద, మధుసూదన్‌తో పాటు ఉద్యమ నాయకులందరిని అరెస్టు చేసి పోలీసు జీపులెక్కించారు. లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగంతో జనాలను భయభ్రాంతులు చేసి దొరికిన యువకులనల్లా పట్టుకెళ్లారు. గ్రామంలో పోలీసు పికెట్. రోజూ పోలీసుల కవాతు. చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల్లో పోలీసుల మోహరింపు. దొరికిన వారిని దొరికినట్లు పోలీస్ స్టేషన్లకు తరలింపు. ఆడవారిని కూడా వదిలిపెట్టలేదు. మొత్తానికి భయానక వాతావరణం ఏర్పడింది.

సహించేవాడు కాదు. విప్లవకారుల పేరుతో అన్యాయంగా నలుగురు యువకులను కాల్చిచంపి ఎన్‌కౌంటర్ నిరంజన్‌దాసు అయ్యాడు. ఎప్పుడూ ఓ పది మంది సెక్యూరిటీ లేందే బయటకెళ్లలేని భయం భయం బతుకు ఆయనది.

"అయ్యా డి.యస్.పి. గారూ నిజం మాట్లాడితే, అన్యాయాన్ని ఎదిరిస్తే మా రైతుల గోస చెప్పుకుంటే, మా గ్రామ ప్రజల బాధ చెప్పుకుంటే, మా ఆడపడుచుల బాధ, మా కడుపు మంట చెప్పుకుంటే మేం కమ్యూనిస్టులమా! విప్లవకారులమా! కానియ్యండి. మేం ప్రజల పక్షాన నిలబడుతాం. మా ఊరిని వల్లకాడుగా మార్చే ఫ్యాక్టరీని పెట్టనివ్వమంటే పెట్టనివ్వం. మా ప్రాణాలు పోయినా సరే వెనకడుగు వేసేది లేదు ఏంజేసుకుంటారో చేసుకోండి" విద్యార్థి నాయకుడు మధుసూదన్ మాట్లాడటంతో సభ వేడెక్కింది. పెద్ద పెట్టున నినాదాలు మొదలయ్యాయి. "డౌన్ డౌన్, గోబ్యాక్" నినాదాల మధ్య కాసేపు మంతనాలాడి కలెక్టరు, సుబ్బరాజు, అధికారులంతా గ్రామసభ ముగిసిందని చెప్పి వెళ్ళిపోయారు.

అర్ధరాత్రి గాఢ నిద్రలో గ్రామం. అమావాస్య చీకటి రాత్రి. పోలీస్ సైరన్ మోతలు, డి.యస్.పి. నిరంజన్ దాసు పోలీసు బలగంతో గ్రామ దిగ్బంధం చేశాడు. దీక్షా శిబిరం కూల్చివేశాడు. గాఢ నిద్రలో ఉన్న సంజీవరావు, ముత్తమ్మ, యలమంద, మధుసూదన్‌తో పాటు ఉద్యమ నాయకులందరిని అరెస్టు చేసి పోలీసు జీపులెక్కించారు. లారీచార్జ్జీ, బాష్పవాయువు ప్రయోగంతో జనాలను భయభ్రాంతులు చేసి దొరికిన యువకులనల్లా పట్టుకెళ్లారు. గ్రామంలో పోలీసు పికెట్. రోజూ పోలీసుల కవాతు. చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల్లో పోలీసుల మోహరింపు. దొరికిన వారిని దొరికినట్టు పోలీస్ స్టేషన్లకు తరలింపు. ఆడవారిని కూడా వదిలిపెట్టలేదు. మొత్తానికి భయానక వాతావరణం ఏర్పడింది.

అనుకున్న ప్రకారం ఓ వారం రోజుల్లో అనుకున్న చోట భారీ పోలీసు బందోబస్తు మధ్య రాజా ఫార్మసీ మందుల ఫ్యాక్టరీ శంకుస్థాపన ఘనంగా జరిగింది. క్యాబినెట్ మంత్రి గుర్నాథరెడ్డి, సుబ్బరాజు జిల్లా అధికారులు మందీ మార్బలంతో కార్యక్రమం సజావుగా సాగింది. ఉద్యమకారులంతా పోలీసు స్టేషన్‌లోనే ఉన్నారు.

ఇక ఆ రోజు నుండి నిర్మాణ కార్యక్రమాలు ఊపందు కున్నాయి. ఫ్యాక్టరీ నిర్మాణంతో పాటు గుడి, బడి, హాస్పిటల్ పనులు చకచక జరిగిపో తున్నాయి. మెయిన్‌రోడ్డు నుండి గ్రామానికి రెండు కిలోమీటర్ల డబుల్‌లైన

స్టేజీ మీదున్న అధికారుల్లో అసహనం మొదలైంది. డి.యస్.పి. నిరంజన్ దాసు పొట్టమీద నుండి జారి పోతున్న బెల్టు సరిచేసుకుని మీసం మీద చేయి వేసి నెత్తిమీద టోపీ అటూఇటూ తిప్పి చేతికర్రతో టేబుల్ మీద టకటకలాడించాడు. అతని కండ్లు ఎర్ర బారాయి. కలెక్టరు ముందు జరుగుతున్న గొడవకు కోపం నషాలానికెక్కింది. "చూడండీ చట్టాన్ని మీచేతుల్లోకి తీసుకుని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వూరుకునేది లేదు. మీరు చెప్పేది మీరు చెప్పారు. మేము చెప్పేది వినాలిగాని ఈ గొడవేంటి. వయొలెన్సు ఏ విధంగా కంట్రోల్ చెయ్యాలో మాకు బాగా తెల్సు. నెల రోజులుగా ఓపిక పట్టాం. మీరు కమ్యునిస్టుల్లా, విప్లవకారుల్లా మాట్లాడకండి. వూరుకునేది లేదు...." కోపంతో వూగిపోతూ కూర్చున్నాడు డి.యస్.పి. నిరంజన్ దాసు.

తారు రోడ్డు. గ్రామంలో అంతర్గత సిమెంటు రోడ్లు, వీధివీధికి కరెంటు స్తంభాలు వేసి లైట్లు బిగించారు. కూడళ్లలో హైమాస్టు లైట్లు ఏర్పాటు. ఇంటింటికి నల్లా ఇరువై నాలుగ్గంటలు నీళ్ళు వచ్చే ఏర్పాట్లు జరిగాయి.

ఇంతకాలం నిరసనలతో, ఆందోళనలతో అట్టుడికిన గ్రామం క్రమంగా చల్లబడింది. యూనివర్సిటీ విద్యార్థులు యూనివర్సిటీకి వెళ్ళిపోయారు. ఇంజనీరింగ్‌లో సీట్లు రాని కొంతమంది విద్యార్థులకు సుబ్బరాజు తన కాలేజీలో సీట్లు ఇప్పించాడు. కేసుల భయంతో చాలా మంది గప్‌చుప్ అయిపోయారు. తాయిలాలతో ఒక్కొక్కరిని తనవైపు తిప్పుకున్నాడు రాజు. మేనేజర్ సురేంద్ర సర్పంచ్ ఇంట్లో మకాం వేసి అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నాడు.

ఆరునెలల్లో రాజా ఫార్మసీ ఫ్యాక్టరీతో పాటు రామాలయం, హాస్పిటల్, పాఠశాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. కేంద్రమంత్రి, ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, అధికారులంతా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించాడు రాజు. ఓ పదిమంది వేద పండితులు వారం రోజులపాటు పూజలు, యజ్ఞాలు నిర్వహించారు. ఊరి పెద్దలం దరిని పిలిచి అందులో పాల్గొనేలా చేశాడు రాజు.

ఇంటింటికి పులిహోర పొట్లాలు, లడ్డూ, ప్రసాదం పంపిణీ, ఆఖరి రోజు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశాడు. ఆడవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు మగవారికి ధోవతులు, ముసలివారికి పెన్షన్లు పంపిణీ చేశాడు. స్కూలు పిల్లలకు యూనిఫారాలు, బ్యాగులు క్రికెట్ కిట్‌లు పంచాడు.

కార్పొరేటు తలదన్నే పాఠశాల, హాస్టల్ వసతి కల్పించి గ్రామంలోని విద్యార్థులందరిని చేర్పించాడు. వారం వారం హాస్పిటల్‌కు హైదరాబాదు నుండి స్పెషలిస్టులను పిలిపించి ఉచితంగా మందులిచ్చే ఏర్పాటు, మరీ పెద్ద జబ్బయితే హైదరాబాదులోని తన హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేయించే ఏర్పాట్లు చేశాడు. అందరి మీద కేసులు ఎత్తివేయించాడు.

ఇంకో విషయం

తాగినవారికి తాగినంత 'మందు' ఏర్పాట్లు చేశాడు. అన్ని తాయిలాలతో ఒక్కొక్కరుగా అందరిని తనవైపు తిప్పుకున్నాడు సుబ్బరాజు. సిరిపురం గ్రామాన్ని రంగుల ప్రపంచంలో ముంచేశాడు. ఆ వూరి మీద ఓ మాయ పొర కమ్మేలా చేశాడు.

మందుల ఫ్యాక్టరీలో మందుల తయారీ కార్యక్రమం మొదలైంది. నైపుణ్యం పేరుతో పెద్ద ఉద్యోగస్తులందరినీ తన వారితో నింపేశాడు. చిన్నాచితక అటెండర్, స్వీపర్, చౌకీదారు లాంటి పోస్టులు గ్రామస్తులకిచ్చాడు. ఆడవారిని అతి తక్కువ కూలీతో ప్యాకింగ్ పనుల్లో పెట్టుకున్నాడు.

ముందు ఓ పది రకాల మందుల తయారీతో మొదలుపెట్టి రెండు మూడేండ్లలో వందల కొలదీ మందులు తయారీ చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేసి దేశంలో నెం.1 స్థానానికి ఎగబాకింది రాజా ఫార్మసీ. రాత్రి, పగలు రెండు షిఫ్టుల పని చేయటం మొదలుపెట్టింది.

రెండు సంవత్సరాలు గడిచేసరికి బావులలోని, బోర్లలోని నీళ్ళన్నీ క్రమంగా ఎర్రగా చందనంలా మారాయి. ఎటూ రెండు మూడు కిలోమీటర్ల దూరం ఇదే పరిస్థితి. తాగడానికి ఏ మాత్రం పనికిరాకుండా పోయాయి. మినరల్ వాటర్ ప్లాంట్ల పంట పండింది. రాజు ఏర్పాటు చేసిన బోరు నీళ్ళు కూడా పనికి రాకుండా పోయాయి. జనం అయోమయం, ఆందోళనలో పడిపోయారు.

తెల్లటినీళ్ళతో గలగలాపారే అమృతం వాగునీళ్ళు నల్లగామారి కంపు వాసనకొడుతున్నాయి. ఏడాది పొడుగునా పశువులు, మనుషులు ఆ నీళ్ళు తాగి సేద తీరడం జరిగేది. వాగెంట వేసిన బోర్లన్నీ కలుషితమైపోయాయి. ఫ్యాక్టరీ వ్యర్థాలు మొదట్లో దూరంగా డంప్ చేసేవారు. క్రమంగా రాత్రిపూట గుట్ట పక్కనే వున్న వాగులో డంప్ చేయటం మొదలుపెట్టారు.

ఏడాదికి మూడు పంటలు పండే భూములన్నీ చవుడు బారిపోయాయి. పంట పొలాలు ఎర్రగా మారి పెట్టుబడులు రాక రైతులు అప్పులపాలయ్యారు. అదీగాక పెద్దచెరువులోని అర టియంసి నీళ్లని సుబ్బరాజు తన ఫ్యాక్టరీకి మల్లించుకున్నాడు. వెరసి రైతులు ఓ పంట నష్టపోయారు.

గాలి, నీరు కలుషితమైపోయి గ్రామంలో జనం చిత్ర విచిత్ర రోగాల బారిన పడ్డారు. చాలామంది టి.బి., క్యాన్సర్, పచ్చకామెర్లు, దద్దుర్లలాంటి రోగాలతో హాస్పిటల్‌ల చుట్టూ తిరగటం మొదలు పెట్టారు.

రెండేళ్లయ్యేసరికి ఏవో కారణాలతో హాస్పిటల్, పాఠశాల ఎత్తివేశాడు. ముసలివాళ్ళ పెన్షన్లు ఎగనామం పెట్టాడు.

కోటి రూపాయల కాంట్రాక్టుకు ఆశపడి సర్పంచ్ నాగిరెడ్డి ఫ్యాక్టరీ ప్రక్కన ప్రభుత్వ భూమిలో కట్టిన కస్తూర్బా పాఠశాల ముణ్ణాల్ల ముచ్చటైంది. పిల్లలందరికి శరీరమంతా దద్దుర్లు, బొబ్బర్లు, పుండ్లు, దగ్గులు, తుమ్ములతో పాఠశాల అక్కడి నుండి షిఫ్టు చేయటం జరిగింది. ఫ్యాక్టరీ దగ్గరగా వున్న రైతులంతా అయినకాడికి సుబ్బరాజుకు తమ భూములమ్ముకుని వూరు విడిచిపోయారు.

ఎప్పుడూ పచ్చని చెట్లతో, పచ్చని గడ్డితో పశువులకు, మేకలకు, నెమళ్ళకు, కుందేళ్ళకు, రకరకాల పక్షులకు ఆలవాలమైన మల్లన్న గుట్టలు మసిబారిపోయాయి. చెట్లన్నీ ఆకు రాల్చాయి. ఇప్పుడక్కడ నెమళ్ళు కాదు ఏ పిట్టలు లేవు. రాజు వేయించిన రోడ్లు, లైట్లు ఆయన ఫ్యాక్టరీ కొరకే అని ఆలస్యంగా అర్థమైంది.

రాజా ఫార్మసీ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అట్టహాసంగా ఉత్సవాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఫార్మా ఉత్పత్తులు దేశ విదేశాల్లో ఎగుమతి చేసి కోట్ల టర్నోవరు సంపాదించారు. పది కోట్లతో ప్రారంభించిన కంపెనీ ఐదేండ్లలో వేల కోట్ల టర్నోవరుకు ఎదిగింది. వందల ఎకరాల భూములు సంపాదించినది. ఎక్కువ మందులు ఉత్పత్తి చేసినందుకు కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఉత్తమ ఫార్మసీ అవార్డు అందుకుంది.

నష్టపోయిందల్లా సుబ్బరాజు మాయ మాటలతో నమ్మి మోసపోయిన సిరిపురం అమాయక జనం. గాలి, నీరు కలుషితమై రోగాలపాలు కావటం, అమ్మలాంటి అమృతం వాగు విషతుల్యం గావటం, మల్లన్న గుట్ట మసిబారిపోవటం, భూములు కోల్పోయి రైతులు అనాథలు కావటం, కోటి రూపాయల కస్తూర్బా స్కూలు పనికిరాకుండా పోవటం, వెరసి సిరులొలికే సిరిపురం బికారిగా మిగిలిపోయింది.

సంజీవరావు మాస్టారుకు టి.బి., ముత్తమ్మకు పచ్చకామెర్ల వ్యాధి వచ్చిందనే వార్త వూరంతా దావానంలా వ్యాపించింది. అలజడి మొదలైంది. అందరిలో ఆందోళన మొదలైంది. నివురుగప్పిన నిప్పులా వున్న ఆవేశం లావాలా బయటకొచ్చింది. వూరిని కమ్మిన మాయపొర తొలగిపోయింది. ఓ అరుణోదయవేళ "ఫ్యాక్టరీ బంద్ కరో – గాంవ్ కో బచావో" నినాదం ఊపందుకుంది. మరో ఉద్యమం పురుడు పోసుకుంది.

మేరెడ్డి యాదగిరి రెడ్డి
9949415796



మార్క్స్ జెన్నీ ప్రేమ కథ

ప్రేమ... విప్లవం...

త్వరలో పుస్తక రూపంలో....

మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్' పుస్తకాన్ని 'ప్రేమ విప్లవం' సీరియల్‌గా 33 వారాలపాటు ప్రచురించాం. అతి త్వరలో ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు పుస్తకంగా తీసుకురానున్నారు. అందువల్ల సీరియల్‌ను ఆపివేస్తున్నాం. పాఠకులు మార్క్స్ జెన్నీల ప్రేమకథను ఒకేసారి చదువుకోగలరు. ఈ అమూల్య గ్రంథాన్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి అందించిన ప్రముఖ అనువాదకులు ముక్తవరం పార్థసారథి గారికి... ఇంతకాలం సీరియల్‌ను ఆదరించిన పాఠక మిత్రులకు ధన్యవాదాలు.

- ఎడిటర్

పదాలు కనుక్కోండి?

పిల్లలు ఈ చిత్రంలో ఏడు బొమ్మలు ఇచ్చారు. వాటికి ఎదురుగా ఉన్న బాక్సులల్లో వాటి పేర్లలోని కొన్ని అక్షరాలు వున్నాయి. మిగతా బాక్సుల్లో అక్షరాలను పూరించి సరైన పదాన్ని కనుక్కోండి.

	b			n	
			l	l	
	f	a			
	b	i		e	
	y		m		
		u	i	c	
	s		o	e	

ఆ రెండు ఏవి?

ఈ చిత్రంలో ఓ విచిత్ర జీవి ఉంది. అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించి చెప్పండి.

కుక్క బొమ్మ వేసేద్దామా?

7 తేడాలు గుర్తించండి

ఆర్టిస్టు అంకుల్ ఓసారి సముద్రం ఒడ్డుకు వెళ్లాడు. అక్కడ ఈత కొడుతున్న పిల్లల బొమ్మను వేశాడు. అయితే ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టాల్సింది మీరే. గుర్తించి సున్నా చుట్టండే.



దేని తోక ఏది?



దారి కనిపెట్టండి?

పిల్లలు ఈ చిత్రంలో ఉండే పాప తన నేస్తం బర్త్‌డే పార్టీకి వెళ్లే దారి మరిచిపోయింది. దారి చూపించి తన మిత్రుడి బర్త్‌డేకి శుభాకాంక్షలు చెప్పండి.



బన్నీల రాజ్యం

కేరట్లను కరకర కొరికేస్తూ డాఫీ డక్‌ను ముప్పు తిప్పలు పెట్టే బగ్స్ బన్నీ అంటే మీకు చాలా ఇష్టం కదా. కుందేళ్లన్నా, కుందేలు బొమ్మలను చూసినా ఎగిరి గెంతేస్తారు కదా. అయితే మీరు అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న పాసెడేనా బన్నీ మ్యూజియం గురించి తెలుసుకోవాల్సిందే. స్టీవ్ లుబాన్‌స్కీ, కెనడేస్ ఫ్రాజీలు తమ ప్రేమకు గుర్తుగా ఈ మ్యూజియాన్ని రూపొందించారు. 1993 వాలంటైన్ దినోత్సవం రోజున స్టీవ్ కెనడేస్‌కు మొదటి బన్నీని బహుమతిగా ఇచ్చాడు. తర్వాత ఆమె ఓ సిరామిక్ బన్నీని ఈస్టర్ రోజున గిఫ్ట్‌గా ఇచ్చింది. ఇలా బన్నీలకు చెందిన ఆర్టికల్స్‌ను బహుమతులుగా ఇచ్చిపుచ్చుకోవడం వారికి ఓ అలవాటుగా మారింది. పెళ్లిని కూడా బన్నీల థీమ్‌లోనే చేసుకున్నారు. కొన్ని వందల రకాల బొమ్మలు, ఫర్నీచర్, వినియోగ వస్తువులతో వారి ఇల్లు నిండిపోయింది. అప్పుడు వచ్చిన ఆలోచనతో వారి ఇంటిని బన్నీ మ్యూజియంగా మలిచారు.

- మార్చి 20 1998లో సందర్శకుల కోసం తెరిచారు.
- ఇప్పుడు ఆ మ్యూజియంలో 31 వేలకు పైగా బన్నీ వస్తువులున్నాయి.
- బగ్స్ బన్నీ, లోలా బన్నీ, అంకుల్ విగ్లీ, మిఫ్పీ, పీటర్ రాబిట్, మార్చ్ హేర్‌తో పాటు ఎన్నో కార్టూన్, సినిమా బన్నీలు అక్కడ కనిపిస్తాయి.
- ఎల్విస్ పార్లీ అనే బన్నీ అక్కడ ప్రత్యేక ఆకర్షణ. రాక్‌స్టార్, ప్రఖ్యాత గిటారిస్ట్ ఎల్విస్ ప్రెస్లీని పోలి ఉంటుంది ఇక్కడ బన్నీ.
- ప్రపంచంలోనే ఎక్కువ బన్నీ వస్తువులున్న మ్యూజియంగా ఇది గిన్నీస్ బుక్ రికార్డును సాధించింది.
- ఈ మ్యూజియాన్ని చూడాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలి. మీ దగ్గరుండే బన్నీ బొమ్మలను ఇక్కడ పెట్టొచ్చు.
- కేవలం బొమ్మలే కాదు నిజమైన కుందేళ్లు కూడా ఇక్కడ చాలా ఉంటాయి. వీటికి కేరట్లంటే ఇష్టమని వాటిని తీసుకెళదామంటే కుదరదు. వేరే కూరగాయల్ని తేవాల్సిందిగా కోరతారు. ఎందుకంటే అందరూ కేరట్లే తెస్తే మిగతావి ఎలా.
- రోజ్ పెరేడ్ అనే ఉత్సవంలో పెద్ద పెద్ద ఎనిమిది బన్నీ బొమ్మల్ని ప్రదర్శిస్తారు.
- సిరామిక్, స్టఫ్డ్, కుకీ జార్ ఇలా అనేక రకాల బన్నీ బొమ్మలున్నాయి.

వికసించిన 'ఇసుక పూలు'

'ఆకర్షణీయంగానే గాక, గాఢంగా రాయగల నేర్పు రచయిత్రికి ఉంది' అని ముందు మాటలో చెప్పినట్టు బి. గీతిక రాసిన ఈ కథలు మన మనసుల్ని పట్టి ఉంచి చదివిస్తాయి. ఇసుక పూలంటే ఉప్పు పంట. ఉప్పు పండించే రైతులు దళారుల చేత నష్టపోతున్న వైనాన్ని తెలుపుతుంది. ఐ.టి ఉద్యోగం చేసే కుర్రాడు తమ ఊరి కోసం ఉద్యోగం వదిలి కొత్త మార్గం పడతాడు. ప్రజలను కదిలించి ఉప్పు పంట నుండి దళారులను తరమడంతో పాటు, ఊరికి మేలు చేసే యంత్రాన్ని కనిపెడతాడు. యువత ఆలోచించే కొత్త మార్గాన్ని రచయిత్రి సూచిస్తుంది. ఈ సంపుటిలో ఉన్న పన్నెండు కథలు గ్రామీణ నేపథ్యంలో సాగుతాయి. అంతరించి పోతున్న విలువలపై ఆందోళన కనబడుతుంది. 'జీవన మాయ' కథ ద్వారా మహిళలెంత ముందడుగు వేయగలరో రచయిత్రి వివరిస్తుంది. 'వెన్నెల సోకని పున్నమి' కథ ద్వారా గిరిజనుల జీవితాలను పట్టి చూపుతుంది. 'నరుడా ఏమి నీ కోరిక' ప్రత్యేకమైనది. కొత్త పద్ధతిలో మనిషిలోని స్వార్థాన్ని ఎండగడుతుంది. దీనిలోని 12 కథల్లో 6 కథలు వివిధ సందర్భాలలో పలు సంస్థల బహుమతులు అందుకున్నాయి. 'ఈ కథల్లో ఏ కథ చదివినా ఆమె సులువుగా కథ చెప్పగలదని అర్థం అవుతుంది. సరళంగా కథ చెప్పటం క్లిష్టంగా ఉన్న చోట ఓ క్షణం ఆగి తీరిక పరచటం రచయిత్రికి తెలుస'ని ముందు మాటలో చెప్పిన మాట నిజం. కథా ప్రియులు తప్పక చదవాల్సిన పుస్తకమిది.

- భవిష్య



ఇసుక పూలు,
కథా సంపుటి, రచన: బి. గీతిక,
వెల: రూ 140/-,
పేజీలు:134 ,
ప్రతులు దొరుకుచోటు:
అన్ని ప్రముఖ పుస్తక షాపులు.

చదివించే 'సత్య'

కథా నవలా రచయితగా సుప్రసిద్ధులైన అర్నాద్ అందించిన నాల్గవ నవల ఇది. నాలుగేళ్ళ కిందట స్వాతి వీక్లీలో ప్రచురణై పాఠక ఆదరణతో పాటు బహుమతి కూడా గెల్చుకుంది. వడ్డెర చండీదాస్, బుచ్చిబాబు, గోపీచంద్, చలం లాంటి ప్రముఖ రచయితలు మానసిక విశ్లేషణతో హృదయాల్ని హత్తుకుపోయేలా అనేక నవలలు రాశారు. నవల ఆఖరు దాకా ఏక బిగువున చదివించే గుణం ఉండడంతో పాఠకులు తేలిగ్గా అర్థం చేసుకోగలరు. ఒక వ్యక్తి కష్టాల్లో ఉన్నప్పుడు చుట్టాలు, బంధువులు దూరంగా వెళ్లిపోతారు. మళ్ళీ సంపదలొస్తే దగ్గరవుతారు. ఈ నవలలో కొన్ని సంఘటనలు చదువుతున్నప్పుడు.... ప్రముఖ రచయిత నాటకకర్త ఆత్రేయ 'కప్పలు', రంగనాయకమ్మ 'జానకి విముక్తి' గుర్తుకొస్తాయి. ఇక నవల విషయానికొస్తే 1974లో జరిగిన కథగా కథానాయకి సత్య-కృష్ణారావుల పెళ్ళిలో ఆరంభమైనట్లు తొలి పేజీలోనే తెలిపారు. కృష్ణారావు ఒక అనుమానపు శాడిస్ట్ భర్త. సత్య తరపు వారిని కృష్ణారావు రానీయడు. ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్ళే కృష్ణారావు తీరుకు బాధపడుతుంది సత్య. పిన్ని బాబాయిల రాకతో ఆమె స్థితి తెల్సివస్తుంది. తండ్రి హఠాన్మరణంతో సవతి తల్లి ఆదరణ లేని సత్య, ఓ ఆడబిడ్డకు జన్మనివ్వడం... హాస్పిటల్‌లోనే భార్యను కృష్ణారావు తిట్టడం... పొరుగు ఇంటి రామయ్యమ్మ "అమ్మలా" సత్యను ఆదరించడం...జరిగిపోతాయి. కృష్ణారావు 'సారా'కు బానిసై ఫ్యాక్టరీలో యాక్సిడెంటల్‌గా మృతి చెందుతాడు. కొడుకు ఉద్యోగం కోసం అతని కన్నవారు... తన తమ్మునికి ఉద్యోగం ఇప్పించడం కోసం సవతి తల్లి... సత్య ఇల్లు చేరడంతో... 'కంపెనీ ఉద్యోగం నీ మరిదిది కాదు. నీతమ్ముడిదీ కాదు. నీది...' అంటూ రామయ్యమ్మ సత్యను చైతన్య పరిచి అండగా నిలుస్తుంది. తీరా అక్కడ యూనియన్ లీడర్ అప్పలరాజు విషపు చూపులు, వికృత ఆలోచనలు, డబ్బుకై ఆదిమూర్తి, సూరమ్మల కృత్రిమ ప్రేమలు (అత్తమామలు), సత్యకు సహాయం చేసి ఉద్యోగంలో తోడ్పడిన స్వామి, ఒంటరి స్త్రీపై సమాజం చేసే అల్లరి నిందలు తట్టుకోవడం, అందరిలాగే స్వామి కూడా సత్యను కోరడం, చివరకు బదిలీతో హైదరాబాద్ ట్రైన్ ఎక్కే సమయంలో సత్య చేయి నొక్కే స్వామి పాత్రపై గౌరవం పోతుంది. అలాగే సంప్రదాయాలు పురాతన విలువలు, హిందూ సంస్కృతికి అంకితం అయినట్టుగా సత్యను చూపడం ఆశావహ దృక్పథంగా లేదు. ఆదర్శ వివాహం ద్వారా ముగింపు ఇస్తే బాగుండేది.

- ప్రసన్న కుమారి



సత్య (నవల), రచన: అర్నాద్,
పేజీలు: 160,
వెల: రూ .150/-,
ప్రతులకు: ముల్లంగి వెంకట రమణారెడ్డి, ఇంటి నెంబరు: 39-18-1, సాయి సూర్య రెసిడెన్సీ, మాధవధార, విశాఖపట్నం-530007. మరియు ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్.

చిత్ర గ్రామం

ఆ గ్రామం కేవలం ఫొటోలోన్నే కనిపిస్తుంది. గూగులంతా జల్లెడించినా ఎక్కడా కనబడదు. అమెరికాకు చెందిన ఛాయా చిత్ర కళాకారడు మైఖేల్ పాల్ స్మిత్ గంటల తరబడి ఈ గ్రామాన్ని చిత్రీకరిస్తుంటాడు. ఆయనకు తప్ప ఆ గ్రామం చిరునామా దొరకదు. మరో మనిషి ఎరుగని ఆ గ్రామం పాల్ సృష్టే. నాలుగు అడుగులు కూడా లేని ఆ గ్రామం ఛాయాచిత్రాలు చూస్తే లైఫ్ సైజ్ ఫొటోలని నమ్మేస్తాం. దాని పేరు ఎల్గిన్ పార్క్, అది ఓ మినియేచర్ గ్రామం. భిన్న వాతావరణం, పరిసరాలతో దశాబ్దాల క్రితం గ్రామాన్ని అత్యద్భుతంగా సృజిస్తున్నాడు. అచ్చు వింటేజీ ఫొటోలను చూసిన భావం కలుగుతుంది ఆ మినియేచర్ గ్రామ చిత్రాల్ని చూస్తుంటే. 1920 నుంచి 60 వరకు అతను చిన్నప్పడు చక్కర్లు కొట్టిన గ్రామానికి నకలుగా దీన్ని రూపొందించి తనెంతో ఇష్టపడే ఆ ఊరి కలను చిత్రాల్లో పదిలం చేస్తున్నాడు. కార్డు బల్లల మీద ఫ్రాంక్లిన్ మింట్, డాన్‌బరీ మింట్ డై కాస్ట్ కార్లను, ట్రక్కులను, ఇళ్ల మోడళ్లతో ఈ గ్రామాన్ని రూపొందిస్తాడు. రెసిన్ కాగితం, స్టైరీన్ ప్లాస్టిక్, బాస్‌వుడ్‌లను ఉపయోగిస్తాడు. సుమారు 300కు పైగా డై కాస్ట్ మోడళ్లు ఆయన దగ్గర ఉన్నాయి. చుట్టూ ఉండే పరిసరాలతో బ్యాక్‌గ్రౌండ్‌ను తీసుకుని ఫొటోలు తీస్తాడు. ఫొటోషాపిని అస్సలు ఉపయోగించకుండా కెమెరా కంపోజిషన్‌ను చక్కగా వినియోగించి వీటిని క్లిక్‌మనిపిస్తాడు. ●



మైఖేల్ పాల్ స్మిత్

‘కన్న’ ప్రేమ

‘ఊరుకో ఊరుకో బంగారు కొండ.. నల్ల కలువ కళ్లు ఎర్రబారనీకుండా..’ అంటూ ఆత్మబంధం చిత్రంలో పిల్లాడిని జోలపాడుతూ ఊరడిస్తుంది తల్లి. అదే పాటలో ‘అమ్మ ఒట్టి మొద్దురా.. జట్టు ఉండొద్దురా...’ అని ఎవరైనా అంటే ‘చెప్పరా ఆ గుండెలో చప్పుడు నేననీ...’ అంటూ తన లాలిపాటలో అనిర్వచనీయమైన కన్న ప్రేమను కాస్తైనా వివరించే ప్రయత్నం చేస్తుంది. తల్లి ప్రేమ మాటలకు అందదు. వర్ణనలకు సరిపోదు. ప్రత్యక్షంగా చూస్తే కానీ, ఆ కన్న ప్రేమ కనగలం. గుండెల్లో వినగలం. అది ప్రకృతంతా పరుచుకుని నేల తల్లిని చేసింది. భూమాతనే ఇచ్చింది. వన్యప్రాణుల కన్న ప్రేమలో పడి మనమూ పరవశించిపోదాం. కన్నతల్లితో జట్టుకట్టి మురిపాలు ఒలకబోస్తోన్న పసికూనల ఆటల్లో పడి ప్రకృతివశమైపోదాం.

●